అక్షర కలం
తెలుగు దినపత్రిక
విలేఖరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా దూసుకెళ్తున్న 'అక్షర కలం'తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు మండలాల వారిగా, నియోకవర్గాలవారిగా,జిల్లాల వారిగా విలేకరులు, యాడ్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను.
గమనిక : డిగ్రీ ఉత్తీర్ణులు మరియు వివిధ పత్రికలలో పని చేసిన అనుభవం ఉన్నవారికి ప్రాముఖ్యత కలదు
epaper.aksharakalam.com
aksharakalam@gmail.com
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 93962 18955

epaper. aksharakalam. com

# అక్షర కలం

తెలుగు దినపత్రిక

aksharakalam@gmail.com

AK NEWS 24X7

సంపుటి : 19 సంచిక : 177 | 23-09-2026 బుధవారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ | Published from Nalgonda, circulated throughout Telangana state | పేజీలు : 8 వెల : రూ.1.00

# నీటి విషయంలో తెలంగాణను ముంచింది బీఆర్ఎస్ కాదా?: కాంగ్రెస్



హైదరాబాద్:

**బీఆర్ఎస్ నేతలు అవకాశవాద రాజకీయాలు చేస్తున్నారని, కావాలనే రైతులను రెచ్చగొడుతున్నారని మంత్రులు వాకిటి శ్రీహరి , జూపల్లి కృష్ణారావు మండిపడ్డారు. రైతులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆక్షేపించారు. మంగళవారం వారు మీడియాతో మాట్లాడుతూ.. నీళ్ల కోసం కర్ణాటక ప్రభుత్వంతో చర్చిస్తున్నామని చెప్పారు.జూరాల డ్యామ్ వద్ద బీఆర్ఎస్ చేస్తున్న హంగామా అంతా ఇంతా కాదని మంత్రి వాకిటి మండిపడ్డారు. "ప్రస్తుతం నీరు ఎంత అందుబాటులో ఉంది? తాగునీటి అవసరాల కోసం ఎంత నీరు అవసరమో తెలుసా? రైతులకు మేలు జరగాలనే ఉద్దేశం బీఆర్ఎస్ నేతలకు లేదు. 811 టీఎంసీల్లో 299 టీఎంసీలు సరిపోతాయని నాడు మీరు చెప్పలేదా? నీటి విషయంలో రాష్ట్రాన్ని ముంచింది ఎవరు? రాష్ట్ర రైతులపట్ల మరణశాసనం రాసింది మీరు. రైతులు, వ్యవసాయ పేటెంట్ కాంగ్రెస్‌దే" అని వాకిటి శ్రీహరి అన్నారు.**

### నోటికి ఎంతొస్తే అంత మాటలా?మంత్రి జూపల్లి

బీఆర్ఎస్ నేతలు నోటికి ఎంతొస్తే అంత మాట్లాడుతున్నారని మంత్రి జూపల్లి కృష్ణారావు మండిపడ్డారు. కర్ణాటక ప్రభుత్వం కాళ్లు పట్టుకోవాలని బీఆర్ఎస్ అంటోందన్న ఆయన.. రైతుల కోసం కాళ్లు మొక్కితే తప్పేముందని ప్రశ్నించారు. " నీటి అంశంపై కర్ణాటక ప్రభుత్వంతో చర్చిస్తున్నాం.ఆ రాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖ కూడా రాశాం. రేపు నీళ్లు తీసుకురాబోతున్నామని బీఆర్ఎస్‌కు తెలుసు. అందుకే ఆ పార్టీ నేతలు ఇవాళ హడావుడి చేస్తున్నారు. రైతులను పక్కదారి పట్టించేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. పాలమూరు జిల్లా గురించి మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదు. అబద్ధాలను ప్రజలు నమ్ముతారని ఆ పార్టీ భ్రమల్లో ఉంది. గత ప్రభుత్వం జూరాలలో ఎందుకు పూడిక తీయలేదు. అందుకే జూరాలలో ఎంత నీరు ఉందో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఎల్‌నినో పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలనే అంశంపై సలహాలు ఇవ్వండి. అంతేతప్ప.. అవసరాన్ని అవకాశంగా వాడుకోవద్దు" అని జూపల్లి మండిపడ్డారు.






## 12 రాజ్యసభ స్థానాలకు ఎన్నికల షెడ్యూల్ విడుదల.. పూర్తి వివరాలు ఇవే..

రాజ్యసభలో ఖాళీ కానున్న 12 స్థానాలకు ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఇందులో ఉత్తరప్రదేశ్‌లో 10, ఉత్తరాఖండ్‌లో ఒక రాజ్యసభ స్థానానికి ద్వైవార్షిక ఎన్నికలు జరగనున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో ఖాళీ అయిన మరో స్థానానికి ఉపఎన్నిక నిర్వహించనున్నారు. పశ్చిమ బెంగాల్‌లోని రాజ్యసభ స్థానం రుక్మిణి మల్లిక్ రాజీనామాతో 2026 జులై 16న ఖాళీ అయింది. ఈ స్థానానికీ ఇదే షెడ్యూల్ ప్రకారం ఉపఎన్నిక జరగనుంది.

2



## కావేరి వివాదంపై సుప్రీంకోర్టు కీలక తీర్పు

కావేరి జలాల వివాదంలో సుప్రీంకోర్టు కీలక తీర్పు చెప్పింది. కర్ణాటకకు 70 టీఎంసీల నీటిని అదనంగా కేటాయించాలని కోరుతూ దాఖలైన రిట్ పిటిషన్‌ను కొట్టివేసింది. ప్రైవేట్ సొసైటీల పిటిషన్లు చెల్లవన్న సుప్రీంకోర్టు.. అంతర్రాష్ట్ర నీటి వివాదాల్లో మూడో వ్యక్తులు లేదా సొసైటీలు జోక్యం చేసుకోలేవని స్పష్టం చేసింది. సొసైటీల పిటిషన్లను విచారిస్తూ పోతే వివాదాలు ముగియవని సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర వ్యాఖ్యలు చేసింది. కావేరి జలాలపై తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు ఇప్పటికే చట్టపరంగా పోరాడుతున్నాయని గుర్తుచేసింది. రెండు రాష్ట్రాల నదీ జలాల వివాదంలో ప్రైవేట్ సొసైటీలకు స్థానం లేదని తేల్చి చెప్పింది. నదీ జలాల కేటాయింపులపై సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలకే మాట్లాడే హక్కు ఉంటుందని పునరుద్ఘాటించింది.

2




2

## యూపీఐ పేమెంట్స్‌పై కేంద్రం క్లారిటీ

యూపీఐ (ఖూ×) లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (వీణ=) విధింపునకు సంబంధించిన ప్రచారంపై కేంద్రం మంగళవారం స్పష్టత ఇచ్చింది. దీనిపై అపోహలు వద్దని వెల్లడించింది. చిన్న వ్యాపారులపై అదనపు భారం ఉండదని తెలిపింది. రూ. 2 వేల వరకు ఉన్న యూపీఐ మర్చంట్ పేపెంట్స్‌కు ఎండీఆర్ పూర్తిగా జీరో అని పేర్కొంది. ఈ నేపథ్యంలో జీఎస్టీ భారం కూడా ఉండదని స్పష్టం చేసింది. ప్రభుత్వం ప్రకారం 96 శాతానికిపైగా రూ.2 వేల లోపే.. మెజారిటీ డిజిటల్ చెల్లింపులకు వీణ= వర్తించదని వెల్లడించింది.

## కొత్త పెన్షన్లపై మంత్రి సీతక్క కీలక ఆదేశాలు.. దసరాకు ముందే పంపిణీ!



2

తెలంగాణలో కొత్త పెన్షన్లపై మంత్రి సీతక్క కీలక ఆదేశాలు జారీ చేశారు. అక్టోబర్‌లో కొత్త పెన్షన్ల ప్రారంభానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దసరా పండుగకు ముందే అర్హులైన లబ్ధిదారులకు కొత్త పెన్షన్లు అందేలా చూడాలని సూచించారు. క్షేత్రస్థాయి వెరిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించి ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని సూచించారు.



2

## జూబ్లీహిల్స్ సీఐకి సుప్రీంకోర్టులో స్వల్ప ఊరట..

## సీఎం రేవంత్ చేతకానితనం వల్లే ఆదిలాబాద్ రిమ్స్ ప్రమాదం: కేటీఆర్..



2

ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రి ప్రమాదంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించి ముగ్గురు చిన్నారులు మృతిచెందడం అత్యంత బాధా కరమని ఆయన అన్నారు. ఈ ప్రమాదంలో మరో 23 మంది చిన్నారులు గాయపడ్డారని, వారికి వెంటనే మెరుగైన చికిత్స అందించి ప్రాణాలు కాపాడాలని పేర్కొన్నారు.

## ఆ నోటీసులకు కారణం ఏంటి.. ఈసీకి సుప్రీం ప్రశ్న

ఢిల్లీ సర్ ప్రక్రియలో భాగంగా లాజికల్ డిస్క్రిపెన్సీస్ కేటగిరీ కింద ఓటర్లకు జారీ చేస్తున్న నోటీసులపై సుప్రీం కోర్టు ఈసీపై పలు ప్రశ్నలు సంధించింది. ఏ ప్రాతిపదికన ఈ నోటీసులు జారీ చేస్తున్నారని ఈసీని ప్రశ్నించింది.

2



## కవిత సమరశంఖం

2

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్ లో కవిత సమర శంఖం పూరించారు. ఆదివారం కొడంగల్ వేదికగా జరిగిన పాంచ జన్య సంకల్ప సభలో కవిత ఓపెన్ గా మాట్లాడారు. ఎటువంటి ఫిల్టర్లు లేకుండా తన అభిప్రాయాన్ని.. మొహమాటం లేకుండా చెప్పేశారు.నేను వాళ్ళు వదిలిన బాణం.. వీళ్ళు వదిన బాణం కాదు.



# 12 రాజ్యసభ స్థానాలకు ఎన్నికల షెడ్యూల్ విడుదల.. పూర్తి వివరాలు ఇవే..

ఢిల్లీ:

రాజ్యసభలో ఖాళీ కానున్న 12 స్థానాలకు ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఇందులో ఉత్తరప్రదేశ్‌లో 10, ఉత్తరాఖండ్‌లో ఒక రాజ్యసభ స్థానానికి ద్వైవార్షిక ఎన్నికలు జరగనున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో ఖాళీ అయిన మరో స్థానానికి ఉపఎన్నిక నిర్వహించనున్నారు. పశ్చిమ బెంగాల్‌లోని రాజ్యసభ స్థానం రుక్మిణి మల్లిక్ రాజీనామాతో 2026 జులై 16న ఖాళీ అయింది. ఈ స్థానానికీ ఇదే షెడ్యూల్ ప్రకారం ఉపఎన్నిక జరగనుంది.

**ఎన్నికల షెడ్యూల్ ఇదే..**

ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను సెప్టెంబర్ 29న విడుదల చేయనున్నారు. నామినేషన్ల దాఖలుకు అక్టోబర్ 6 చివరి తేదీగా ఈసీ నిర్ణయించింది. అక్టోబర్ 7న నామినేషన్ల పరిశీలన చేపట్టనున్నారు. అభ్యర్థిత్వాలను ఉపసంహరించుకునేందుకు అక్టోబర్ 9 వరకు గడువు ఇచ్చారు. అక్టోబర్ 16న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. మొత్తం ఎన్నికల ప్రక్రియను అక్టోబర్ 19లోపు పూర్తి చేయాలని ఈసీ నిర్ణయించింది.

**బ్యాలెట్‌పై ప్రత్యేక నిబంధన..**

రాజ్యసభ ఎన్నికల్లో బ్యాలెట్‌పై ప్రాధాన్యం గుర్తులను నమోదు చేసేందుకు రిటర్నింగ్ అధికారి అందించే నిర్దిష్ట వైలెట్ రంగు స్కెచ్ పెన్‌ను మాత్రమే ఉపయోగించాలని ఈసీ స్పష్టం చేసింది. ఇతర పెన్నులతో గుర్తులు వేయకూడదని పేర్కొంది. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా పరిశీలకులను నియమించి, మొత్తం ప్రక్రియను పర్యవేక్షించనున్నట్లు తెలిపింది.

**ముగియనున్న పలువురు నేతల పదవీకాలం..**

నవంబర్ 25తో కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి సహా పలువురు రాజ్యసభ సభ్యుల పదవీకాలం ముగియనుంది. వీరిలో ఉత్తర ప్రదేశ్ నుంచి బీజేపీ నాయకులు అరుణ్ సింగ్, గీతా షాక్య, నీరజ్ శేఖర్, బ్రిజ్‌లాల్, బీఎల్ వర్మ, సీమా ద్వివేది, సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు రామ్ గోపాల్ యాదవ్, బీఎస్పీకి చెందిన రామ్జీ గౌతమ్ ఉన్నారు.

# ఎస్సీ ఎస్టీ అట్రాసిటీస్ నిరోధక చట్టం అమలుపై ఉన్నతస్థాయి సమావేశం

## హాజరయిన సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్ అక్షరకలం ప్రతినిధి

సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీస్ నిరోధక చట్టం 1989 అమలుపై రాష్ట్ర స్థాయి ఉన్నత స్థాయి నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం. జరిగింది. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీలు మల్లు రవి, బలరాం నాయక్, కడియం కావ్య, ఎమ్మెల్యేలు తోట లక్ష్మీకాంతరావు, మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, వేముల వీరేశం, మందుల సామేల్, మట్టా రాగమయి, వెడ్మ బొజ్జు, మురళి నాయక్, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సివి ఆనంద్, ఎస్సీ ఎస్టీ కమిషన్స్ చైర్మన్లు, సభ్యులు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో 2013 ఫిబ్రవరి 11న అప్పటి ముఖ్యమంత్రి అధ్యక్షతన చట్టం అమలుపై స్టేట్ లెవల్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి అధ్యక్షతన స్టేట్ లెవల్ హైపవర్



విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరగడం ఇదే తొలిసారి. రాష్ట్రంలో చట్టం అమలు, నమోదైన కేసులు, దర్యాప్తు, విచారణ, కేసుల పరిష్కారం, బాధితులకు అందుతున్న సహాయం, పునరావాసంపై సమీక్షలో చర్చ జరిగింది. చట్టంపై అవగాహన కార్యక్రమాలు, కేసుల విచారణకు ఏర్పాటు చేసిన ప్రత్యేక కోర్టులు, మొబైల్ కోర్టుల పనితీరుపై చర్చ జరిగింది.

# కావేరి వివాదంపై సుప్రీంకోర్టు కీలక తీర్పు

ఇంటర్‌నెట్ డెస్క్:

కావేరి జలాల వివాదంలో సుప్రీంకోర్టు కీలక తీర్పు చెప్పింది. కర్ణాటకకు 70 టీఎంసీల నీటిని అదనంగా కేటాయించాలని కోరుతూ దాఖలైన రిట్ పిటిషన్‌ను కొట్టివేసింది. ప్రైవేట్ సొసైటీల పిటిషన్లు చెల్లవన్న సుప్రీంకోర్టు.. అంతర్రాష్ట్ర నీటి వివాదాల్లో మూడో వ్యక్తులు లేదా సొసైటీలు జోక్యం చేసుకోలేవని స్పష్టం చేసింది. సొసైటీల పిటిషన్లను విచారిస్తూ పోతే వివాదాలు ముగియవని సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర వ్యాఖ్యలు చేసింది. కావేరి జలాలపై తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు ఇప్పటికే చట్టపరంగా పోరాడుతున్నాయని గుర్తుచేసింది. రెండు రాష్ట్రాల నదీ జలాల వివాదంలో ప్రైవేట్ సొసైటీలకు స్థానం లేదని తేల్చి చెప్పింది. నదీ జలాల కేటాయింపులపై సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలకే మాట్లాడే హక్కు ఉంటుందని పునరుద్ఘాటించింది. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న కావేరి కేసుల నేపథ్యంలో కొత్త వ్యాజ్యాలకు తావులేదని సుప్రీంకోర్టు వెల్లడించింది. కాగా.. కర్ణాటక-తమిళనాడు రాష్ట్రాల మధ్య కొనసాగుతున్న కావేరీ జల వివాదంపై సుప్రీంకోర్టు గత నెల 24న కొన్ని కీలక సూచనలు చేసింది. కర్ణాటక నుంచి తమకు రావాల్సిన కావేరీ నీటి వాటా సక్రమంగా అందడం లేదంటూ తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. ఈ సమస్యపై ముందుగా కావేరీ జల నిర్వహణ ప్రాధికార సంస్థను ఆశ్రయించాలని తమిళనాడుకు సుప్రీంకోర్టు సూచించింది.

# జూబ్లీహిల్స్ సీఐకి సుప్రీంకోర్టులో స్వల్ప ఊరట..

ఢిల్లీ,

మహిళపై లైంగిక వేధింపుల ఆరోపణలతో సస్పెన్షన్ వేటు పడిన జూబ్లీహిల్స్ సీఐ శ్రీనివాసులు రెడ్డికి సుప్రీంకోర్టులో స్వల్ప ఊరట లభించింది. తదుపరి విచారణ వరకు శ్రీనివాసు రెడ్డిని అరెస్టు చేయవద్దని లేదా అతడిపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. మంగళవారం ఈ కేసును జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్ మహదేవన్‌తో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా పై విధంగా హైదరాబాద్ నగర పోలీసులను ఆదేశించింది. అనంతరం ఈ కేసు విచారణను ధర్మాసనం వాయిదా వేసింది. ఓ మహిళను జూబ్లీహిల్స్ మాజీ స్టేషన్ హౌస్ ఆఫీసర్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు రెడ్డి లైంగికంగా వేధించాడు. అంతేకాకుండా ఆమెను బ్లాక్‌మెయిల్ చేసి బలవంతంగా అబార్షన్ చేయించాడంటూ తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఇటీవల అతడిపై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. ఈ నేపథ్యంలో అతడు ముందస్తు బెయిల్ కోసం తెలంగాణ హైకోర్టును ఆశ్రయించాడు. అందుకు కోర్టు నిరాకరించింది. దీంతో తెలంగాణ హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సీఐ శ్రీనివాసులు రెడ్డి సవాల్ చేశారు.

# ఆ నోటీసులకు కారణం ఏంటి.. ఈసీకి సుప్రీం ప్రశ్న

ఇంటర్నెట్ డెస్క్:

ఢిల్లీ సర్ ప్రక్రియలో భాగంగా లాజికల్ డిస్క్రిపెన్సీస్ కేటగిరీ కింద ఓటర్లకు జారీ చేస్తున్న నోటీసులపై సుప్రీం కోర్టు ఈసీపై పలు ప్రశ్నలు సంధించింది. ఏ ప్రాతిపదికన ఈ నోటీసులు జారీ చేస్తున్నారని ఈసీని ప్రశ్నించింది. ఈ కేటగిరీపై స్పష్టత ఇవ్వాలని చెప్పింది. సర్ నోటీసులపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ దాఖలైన పిటిషన్లపై వివరణ ఇవ్వాలని ఈసీని చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాలా బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. ఢిల్లీ సర్ ప్రక్రియ జరుగుతున్న తీరుపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ పలు పిటిషన్లు దాఖలయ్యాయి. సర్ ప్రక్రియ కింద ఓటర్లకు జారీ చేస్తున్న నోటీసుల్లో స్పష్టమైన కారణాలు పేర్కొనట్లేదని పిటిషనర్ల తరఫు న్యాయవాది ప్రశాంత్ భూషన్ పేర్కొన్నారు. ఏ ప్రాతిపదికన ఓటర్లకు లాజికల్ డిస్క్రిపెన్సీ కేటగిరీ కింద నోటీసులు జారీ చేస్తున్నారని ప్రశ్నించారు. ఓటర్ల నుంచి ఏయే పత్రాలు, వివరాలను ఈసీ ఆశిస్తున్నదో కూడా స్పష్టత లేదని అన్నారు. సాధారణ ఓటర్ల వద్ద పరిమితమైన డాక్యుమెంట్స్ మాత్రమే ఉంటాయని చెప్పారు. చాలామంది దగ్గర ప్రాథమిక వివరాలున్న ప్రధాన డాక్యుమెంట్‌గా ఆదార్ కార్డు మాత్రమే ఉంటోందని చెప్పారు. ఓటర్ నమోదు ప్రక్రియలో భాగంగా ప్రజలు అప్పటికే వయసు, నివాస ధ్రువీకరణ పత్రాలు సమర్పించిన నేపథ్యంలో మళ్లీ అదనపు వివరాల నిర్ధారణకు డాక్యుమెంట్స్ ఎందుకు సమర్పించాలని ప్రశ్నించారు. నివాసం మార్పు పేరిట ఇప్పటికే ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి అనేక మంది పేర్లు తొలగించారని చెప్పారు. ఇందుకు అనుసరించిన పద్ధతిపై సందేహాలు లేవనెత్తారు. ఈ విషయాలపై ఈసీ తరఫున సీనియర్ అడ్వొకేట్ డీఎస్ నాయుడు వాదనలు వినిపించారు. ప్రతి నోటీసుకు వెనక గల కారణాన్ని ఈసీ పేర్కొంటుందని ఆయన చెప్పారు. పిటిషనర్లు లెవనెత్తున్న అంశాలు వారు భావిస్తున్నంత తీవ్రమైనవి కావని అన్నారు. మరోవైపు సర్ ప్రక్రియ డెడ్‌లైన్‌ను అవసరమనుకుంటే పొడిగించేందుకు ఈసీ సుముఖంగానే ఉందని కూడా చెప్పారు. చట్టంలో పేర్కొన్న ప్రక్రియకు భిన్నంగా ఒక్కరి ఓటు కూడా తొలగించబోమని హామీ ఇచ్చారు. ఓటర్ల సహాయం కోసం ఇప్పటికే ప్రచార కార్యక్రమాలు, వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేశామని కూడా చెప్పారు. ఈ సందర్భంగా సుప్రీం కోర్టు స్పందిస్తూ నోటీసులు జారీ చేస్తున్న విధానంపై ఈసీని వివరణ కోరింది. యాంత్రికంగా నోటీసులు జారీ అవుతున్నాయా? అని ప్రశ్నించింది. నోటీసులకు గలకారణాలను ఈసీ ఓటర్లకు తగిన విధంగా అందిస్తోందా? అని ప్రశ్నించింది. లాజికల్ డిస్క్రిపెన్సీ అంటే ఏంటో వివరించాలని కూడా చీఫ్ జస్టిస్ ఈసీని కోరారు. అసలు ఈ కేటగిరీలో నోటీసులు ఎలా జారీ చేస్తున్నారనే విషయంలో స్పష్టత ఇవ్వాలని అన్నారు.

# సీఎం రేవంత్ చేతకానితనం వల్లే ఆదిలాబాద్ రిమ్స్ ప్రమాదం: కేటీఆర్..

ఆదిలాబాద్ జిల్లా:

ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రి ప్రమాదంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించి ముగ్గురు చిన్నారులు మృతిచెందడం అత్యంత బాధాకరమని ఆయన అన్నారు. ఈ ప్రమాదంలో మరో 23 మంది చిన్నారులు గాయపడ్డారని, వారికి వెంటనే మెరుగైన చికిత్స అందించి ప్రాణాలు కాపాడాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఘోర వైఫల్యం వల్లే ఇంత పెద్ద ప్రమాదం జరిగిందని మండిపడ్డారు. అభంశుభం తెలియని పిల్లలు అన్యాయంగా బలైపోయారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రభుత్వ వైద్య రంగాన్ని రేవంత్ రెడ్డి పూర్తిగా విధ్వంసం చేశారని మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. ఈ సంఘటనకు ఆయనే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రిమ్స్ ఆస్పత్రిలో నెలకొన్న దుస్థితులపై అనేకసార్లు జిల్లా స్థాయి బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వాన్ని హెచ్చరించారని తెలిపారు. అయినా మొద్దు నిద్ర వీడని రేవంత్ సర్కార్‌లో కనీస చలనం కనిపించలేదన్నారు. అత్యంత పకడ్బందీ చర్యలు తీసుకోవాల్సిన పిల్లల వార్డులో ప్రభుత్వ పర్యవేక్షణ పూర్తిగా లోపించిందని ఆరోపించారు. కనీస నిర్వహణ లేకపోవడం వల్లే ఈ దురదృష్టకర సంఘటన చోటుచేసుకుందని కేటీఆర్ ఆగ్రహించారు. ఆదిలాబాద్ రిమ్స్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లోని పిల్లల వార్డులు, ఐసీయూలను వెంటనే నిపుణులతో తనిఖీ చేయించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. రేవంత్ సర్కార్ చేతకానితనం వల్ల పిల్లలను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న బాధిత కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని పేర్కొన్నారు. ఈ మేరకు ప్రతి కుటుంబానికీ రూ.25లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని బీఆర్ఎస్ పార్టీ తరఫున కేటీఆర్ డిమాండ్ చేశారు.

# యూపీఐ పేమెంట్స్‌పై కేంద్రం క్లారిటీ

ఢిల్లీ,

యూపీఐ (ఖ్రూ×) లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (వీణ=) విధింపునకు సంబంధించిన ప్రచారంపై కేంద్రం మంగళవారం స్పష్టత ఇచ్చింది. దీనిపై అపోహలు వద్దని వెల్లడించింది. చిన్న వ్యాపారులపై అదనపు భారం ఉండదని తెలిపింది. రూ. 2 వేల వరకు ఉన్న యూపీఐ మర్చంట్ పేమెంట్స్‌కు ఎండీఆర్ పూర్తిగా జీరో అని పేర్కొంది. ఈ నేపథ్యంలో జీఎస్టీ భారం కూడా ఉండదని స్పష్టం చేసింది. ప్రభుత్వం ప్రకారం 96 శాతానికిపైగా రూ.2 వేల లోపే.. మెజారిటీ డిజిటల్ చెల్లింపులకు వీణ= వర్తించదని వెల్లడించింది. వ్యాపారి చెల్లించిన జీఎస్టీను ఇన్ పుట్ ట్యాక్స్ క్రెడిట్‌గా.. అమ్మకాలపై చెల్లించాల్సిన +ూ నుంచి సర్దుబాటు చేసుకో వచ్చని కేంద్రం ఈ సందర్భంగా వివరణ ఇచ్చింది. నెలకు లక్ష రూపాయిల వరకు ఖ్రూ× రసీదులు పొందే వ్యాపారులకు ఎండీఆర్ ఉండదని ప్రకటించింది. వారికి వీణ=పై +ూ సమస్య కూడా ఉండదని వివరించింది. ఖ్రూ× చెల్లింపులు ఖరీదు అవుతాయన్న వాదనలు తప్పుదారి పట్టించేవేనని స్పష్టం చేసింది. దీని వల్ల మెజారిటీ లావాదేవీలు, చిన్న వ్యాపారులు ప్రభావితం కారని కేంద్రం వివరణ ఇచ్చింది.

# కొత్త పెన్షన్లపై మంత్రి సీతక్క కీలక ఆదేశాలు.. దసరాకు ముందే పంపిణీ!

హైదరాబాద్,

తెలంగాణలో కొత్త పెన్షన్లపై మంత్రి సీతక్క కీలక ఆదేశాలు జారీ చేశారు. అక్టోబర్‌లో కొత్త పెన్షన్ల ప్రారంభానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దసరా పండుగకు ముందే అర్హులైన లబ్ధిదారులకు కొత్త పెన్షన్లు అందేలా చూడాలని సూచించారు. క్షేత్రస్థాయి వెరిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించి ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ మేరకు సెర్ప్ సీఈవో దివ్యా దేవరాజన్‌కు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఒంటరి మహిళలు, వితంతువులకు పూర్తి స్థాయిలో పెన్షన్లు అందజేయాలని మంత్రి సూచించారు. దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ పెన్షన్లు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దసరా నాటికి కొత్త పెన్షన్ల పంపిణీకి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

# ఆదిలాబాద్ రిమ్స్ లో పెను విషాదం

**చిన్నారుల వార్డులో ఏసీ పేలడంతో 5 రోజుల శిశువు మృతి**

**ఆందోళనకరంగా మరో 24 మంది చిన్నారుల పరిస్థితి**

**ముగ్గురు చిన్నారుల పరిస్థితి విషమం**

అదిలాబాద్

జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రి ఎస్ఎన్సీయూ వార్డులో సోమవారం అర్ధరాత్రి షార్ట్సర్క్యూట్ ఘటన కలకలం రేపింది. చిన్నారుల వార్డులో ఏసీ పేలిపోయింది. దాంతో వార్డు అంతటా దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. భయాందోళనకు గురైన తల్లిదండ్రులు పిల్లలను తీసుకుని బయటకు పరుగులు తీశారు. ఈ ఘటనలో 5 రోజుల శిశువు మృతి చెందగా మరో 24 మంది చిన్నారులను సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించారు. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. అప్రమత్తయిన ఆసుపత్రి సిబ్బంది విద్యుత్ సరఫరాను నిలిపివేసారు. చిన్నారులను పక్క వార్డుకు తరలించారు. అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు.

# కవిత సమరశంఖం

హైదరాబాద్,

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్ లో కవిత సమర శంఖం పూరించారు. ఆదివారం కొడంగల్ వేదికగా జరిగిన పాంచ జన్య సంకల్ప సభలో కవిత ఓపెన్ గా మాట్లాడారు. ఎటువంటి ఫిల్టర్లు లేకుండా తన అభిప్రాయాన్ని.. మొహమాటం లేకుండా చెప్పేశారు. నేను వాళ్ళు వదిలిన బాణం.. వీళ్ళు వదిన బాణం కాదు. అలాంటి తలకాయ లేని మాటలు మాట్లాడను. అలాంటి వారి కోసం నేను కొడంగల్ గడ్డమీద నుంచి చెబుతున్న. ఇప్పటికీ అధికారానికి.. విద్యకు దూరంగా ఉన్న మా బహుజనుల బాణాన్ని నేను. యువకుల యుద్ధ నినాదాన్ని నేను. వారికోసం మోడీతో కొట్లాడుతా. రేవంత్ రెడ్డితో కొట్లాడుతా. చివరికి కేసీఆర్ తో నైనా కొట్లాడుతా. తద్వారా తన మీద వస్తున్న విమర్శలకు ఈ స్థాయిలో కవిత సమాధానం చెప్పారు. అంతేకాదు తనమీద అవాకులు చవాకులు పేరుతున్న గులాబీ పార్టీ సోషల్ మీడియా.. ఆ పార్టీ అనుబంధ సోషల్ మీడియా గ్రూపులకు కవిత గట్టిగానే కౌంటర్ ఇచ్చారు. వాస్తవానికి కవిత పాంచ జన్య సభలో గట్టిగా మాట్లాడారు. ఒక రకంగా దీనిని ఎన్నికల సభ లాగా ఆమె చాలెంజ్ గా తీసుకొని ప్రసంగించారు.. ప్రారంభం నుంచి చివరి దాకా బహుజనుల విషయాలను ప్రస్తావించారు. తన తండ్రి పరిపాలన కాలంలో తెలంగాణ రాష్ట్రంలో ఆశించిన స్థాయిలో మార్పు రాలేదని. ముఖ్యంగా విద్య.. వైద్యం.. ఇతర వాటిల్లో వృద్ధి కనిపించలేదని కవిత క్లారిటీ ఇచ్చారు. విద్య.. వైద్యం వంటివి తమ ప్రధమ ప్రాధాన్యాలు అని కవిత క్లారిటీ ఇచ్చారు. అక్కడితోనే ఆగిపోలేదు.. ఇంకా చాలా విషయాలను కవిత ఈ సభలో చెప్పారు. తన తండ్రి పరిపాలన కాలంలో జరిగిన అవినీతిని.. అక్రమాలను.. తనను బయటికి పంపించిన విధానాన్ని ఆమె వివరించారు. ఇటీవల తన అత్తగారిల్లు అయిన నిజామాబాదులో పాంచ జన్య సభను నిర్వహించిన కవిత.. అక్కడ కన్నీళ్లు పెట్టుకున్నారు. సభలో మాట్లాడుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. కొడంగల్ లో మాత్రం ధైర్యంగా మాట్లాడారు. ప్రభుత్వం మీద ఆరోపణలు చేసిన ఆమె.. చివరికి తన తండ్రిని కూడా వదిలిపెట్టలేదు. అన్నిటికంటే ముఖ్యంగా గులాబీ పార్టీ సోషల్ మీడియాకు దిమ్మతిరిగిపోయేలాగా కవిత రిప్లై ఇచ్చింది. ఒక రకంగా దానిని స్లిప్పర్ షాట్ అని చెప్పవచ్చు. కొద్దిరోజులుగా గులాబీ పార్టీ సోషల్ మీడియా కవిత మీద వ్యక్తిగతంగా దాడి చేసే స్థాయిలో విమర్శలు చేస్తోంది. ఆ విమర్శలకు కవిత ఏర్పాటుచేసిన సోషల్ మీడియా గ్రూపులలో కౌంటర్ ఇస్తున్నప్పటికీ.. గులాబీ పార్టీ సోషల్ మీడియా ఆగడం లేదు. అందువల్లే కొడంగల్ సభ నుంచి కవిత గట్టిగా రిప్లై ఇచ్చారు. మరి దీనికి గులాబీ పార్టీ సోషల్ మీడియా ఎలాంటి కౌంటర్ ఇస్తుందో చూడాలి.

# వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో సజావుగా జరుపుకోవాలి

## జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య



**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 22:**

వినాయక నిమజ్జనం కార్యక్రమాన్ని ప్రజలందరూ మతసామరస్యంతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య తెలిపారు. మంగళవారం జిల్లాలోని లక్షెట్టిపేట మండలంలోని గూడెం, ఇతర ప్రాంతాలలో ఏర్పాటు చేసిన నిమజ్జన ప్రదేశాలను మండల తహశీల్దార్ దిలీప్ కుమార్, మున్సిపల్ కమిషనర్ విజయ్ కుమార్, ఎస్ఐ, మండల పంచాయతీ అధికారులతో కలిసి సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ పి చంద్రయ్య మాట్లాడుతూ, నిమజ్జన ప్రాంతాలలో భక్తులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాటు చేయాలని, విద్యుత్ దీపాలు, నిమజ్జనానికి అవసరమైన క్రేన్లు, పారిశుధ్య నిర్వహణ, బారికేడింగ్, రహదారుల శుభ్రత, త్రాగునీటి సౌకర్యం, వాహనాల రాకపోకల నిర్వహణ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. నిమజ్జన సమయంలో విగ్రహాలను సురక్షితంగా నీటిలోకి తరలించేందుకు ఏర్పాటు చేసిన గజ ఈతగాళ్ల బృందాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అత్యవసర పరిస్థితులలో తక్షణమే స్పందించేలా అవసరమైన సిబ్బంది, రక్షణ పరికరాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. రాత్రివేళలలో తగినంత వెలుతురు ఉండేలా లైటింగ్ ఏర్పాట్లను పూర్తి చేయాలని, క్రేన్లు పనిచేసే స్థితిలో ఉండేలా ముందస్తు తనిఖీలు నిర్వహించాలని, ప్రజలు, భక్తులు నీటిలోకి వెళ్లకుండా అవసరమైన బారికేడ్లు, భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిమజ్జన ప్రక్రియ అనంతరం వ్యర్థాలు, పూజా సామగ్రి తదితరాలను వెంటనే తొలగించేలా పారిశుధ్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, నిమజ్జన పాయింట్ల వద్ద పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులు, వాహనాల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, రాకపోకల నిర్వహణకు తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. వినాయక నిమజ్జన కార్యక్రమం శాంతియుతంగా, సురక్షితంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని, నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల తదితరులు పాల్గొన్నారు.

## జూరాల ప్రాజెక్టు కుడి కాలువ నీటి విడుదలకు గ్రీన్ సిగ్నల్

**జోగులాంబ గద్వాల్ జిల్లా అక్షర కలం ప్రతినిధి**



గద్వాల నియోజకవర్గంలో గత వారం రోజులుగా జూరాల ప్రాజెక్టు కుడి కాలువకు నీరు రాకపోవడంతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ రోడ్లెక్కి ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గద్వాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మరియు ౨+హ+ణజఖీూ చైర్ పర్సన్ సరితా తిరుపతయ్య చొరవ తీసుకున్నారు. రైతుల కష్టాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డితో, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి శ్రీ ఉత్తమ్ కుమార్ రెడ్డితో ఫోన్లో మాట్లాడి పరిస్థితిని వివరించారు.

**సీఎం సానుకూల స్పందన:**

సరితమ్మ విజ్ఞప్తికి సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. వెంటనే సంబంధిత ఇరిగేషన్ అధికారులకు ఫోన్ చేసి ఆదేశాలు జారీ చేశారు.

**రేపటి నుంచి నీటి విడుదలకు హామీ:**

అధికారుల సమాచారం మేరకు రేపు (సెప్టెంబర్ 23) మధ్యాహ్నం నుంచి జూరాల ప్రాజెక్టు కుడి కాలువకు నీటిని విడుదల చేయనున్నట్లు సీఎకార్యాలయం హామీ ఇచ్చింది. దీంతో జూరాల ఆయకట్టు కింద సాగు చేస్తున్న వేలాది మంది రైతులకు ఊరట లభించనుంది. ఖరీఫ్ పంటలు ఎండిపోయే దశలో ఉండగా వచ్చిన ఈ నిర్ణయం రైతుల్లో హర్షం వ్యక్తం చేస్తోంది. గద్వాల నియోజకవర్గ ప్రజల సమస్యలపై తక్షణమే స్పందించిన సీఎం రేవంత్ రెడ్డికి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సరితా తిరుపతయ్య కృతజ్ఞతలు తెలిపారు.

## రాష్ట్ర స్థాయి స్కేటింగ్‌లో గద్వాల చిన్నారుల ప్రతిభ



**జోగులాంబ గద్వాల్ జిల్లా అక్షర కలం ప్రతినిధి**

హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన సోల్ స్పోర్జ్టా స్కేటింగ్ ఛాంపియన్‌షిప్--2026 రాష్ట్ర స్థాయి పోటీల్లో గద్వాల జిల్లాకు చెందిన చిన్నారులు పతకాలు సాధించారు. అండర్--6, 8, 10 విభాగాల్లో షేక్ అతిక సామీన్ కాంస్య పతకం, హన్విక, సాంధిత్య, అయ్యోరు అభిమన్యు వెండి పతకాలు సాధించారు. మంగళవారం ఐడీఓసీ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్‌ను క్రీడాకారులు, తల్లిదండ్రులు, కోచ్ రాజుతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ చిన్నారులను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లాలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు అవసరమైన సహకారం అందిస్తామని, స్కేటింగ్ రింక్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## క్రీడా స్ఫూర్తితో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించాలి



**మందమర్రి, సెప్టెంబర్ 22 అక్షర కలం:**

ప్రశాంతమైన వాతావరణంలో, క్రీడా స్ఫూర్తితో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించాలని ఎఫ్ఎ, (ఏజీఎం) ఆర్వీఎస్ ఆర్కె ప్రసాద్, ఏఐటీయూసీ ఏరియా బైక్స్ ప్రెసిడెంట్ భీమనాథుని సుదర్శన్ తెలిపారు. ఏరియాలోని సింగరేణి ఉన్నత పాఠశాల ఆవరణలో పి యోగ హాల్ లో మంగళవారం నియర్ బై ఏరియా' బాడీ బిల్డింగ్, వెయిట్ లిఫ్టింగ్, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎఫ్ఎ, (ఏజీఎం) ఆర్వీఎస్ ఆర్కె ప్రసాద్, ఏఐటీయూసీ ఏరియా బైక్స్ ప్రెసిడెంట్ భీమనాథుని సుదర్శన్ లు హాజరై, పోటీలను అధికారికంగా ప్రారంభించారు. ?ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, క్రీడాకారులు ప్రశాంతమైన వాతావరణంలో, పూర్తి క్రీడా స్ఫూర్తితో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించాలని తెలిపారు. ఈ పోటీల్లో విజయం సాధించి, త్వరలో రామగుండం రీజన్ పరిధిలో జరగబోయే కంపెనీ స్థాయి పోటీలకు ఎంపికవ్వడమే కాకుండా, బహుమతులు సాధించి బెల్లంపల్లి రీజన్ పేరును నిలబెట్టాలని క్రీడాకారులకు దిశా నిర్దేశం చేశారు. మరో ఆరు నెలల్లో ఉద్యోగ విరమణ పొందనున్న సంస్థ ఉద్యోగులు ములకలపల్లి వెంకటేశ్వర్లు, సిహెచ్ అశోక్ లను అధికారులు, యూనియన్ నాయకులు, క్రీడాకారులు ఘనంగా సన్మానించారు. వీరు సింగరేణి సంస్థకు, క్రీడా రంగానికి అందించిన సేవలను అధికారులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యు పిఎస్, జిఏ గౌరవ కార్యదర్శి కార్యదర్శి కార్తీక్, స్పోర్ట్స్ సూపర్వైజర్ సిహెచ్ అశోక్, జీఎం స్ట్రక్చర్ కమిటీ మెంబర్ సివి రమణ, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ శివ, జనరల్ కెప్టెన్ సాక శీను, బాడీ బిల్డింగ్, బాల్ బ్యాడ్మింటన్ కెప్టెన్లు ములకలపల్లి వెంకటేశ్వర్లు, పెద్దపల్లి బానయ్యలతో పాటు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన క్రీడాకారులు పాల్గొన్నారు.

## "ఆయుర్వేదం -- ఆరోగ్యకరమైన రేపటికి": మరికల్‌లో ఆయుష్ శాఖ కార్యక్రమం :




**నారాయణపేట, సెప్టెంబర్,22, అక్షర కలం:**

మరికల్, సెప్టెంబర్ 22: పదకొండవ జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో, మారికల్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల సహకారంతో ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ పాఠశాల మరియు జూనియర్ కళాశాలలో యోగా నడక మరియు ఆయుర్వేద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డా. హరీష్ చక్ర మార్గదర్శకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయుర్వేద ప్రాముఖ్యత, ఆరోగ్యకర జీవన విధానం, యోగా, శారీరక వ్యాయామం, ఆరోగ్య సంరక్షణపై వివరణ ఇచ్చారు. "ఆయుర్వేదం -- ఆరోగ్యకరమైన రేపటికి" అనే నినాదంతో ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైద్యాధికారి డా. హరీష్ చక్ర, ఔషధ నిపుణురాలు రుక్మిణి దేవి, యోగా శిక్షకులు రవీ, మహేశ్వరి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి గీత తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమ విజయానికి సహకరించిన పాఠశాల సిబ్బంది, విద్యార్థులకు ఆయుష్ శాఖ కృతజ్ఞతలు తెలిపింది.

## అర్హులైన దివ్యాంగులందరికీ సదరం ధ్రువపత్రాలు.

**దివ్యాంగుల ధ్రువీకరణకి ప్రత్యేక వైద్య శిబిరం.**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.**

**జోగులాంబ గద్వాల్ జిల్లా అక్షర కలం ప్రతినిధి**



అర్హులైన దివ్యాంగులకు సదరం ధ్రువపత్రాలు మంజూరు చేసేందుకు, ధ్రువీకరణ ప్రక్రియను సులభతరం చేయడంతో పాటు వైద్య పరీక్షల కోసం ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు.

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సహకారంతో మంగళవారం గద్వాలలోని జిల్లా మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద మానసిక సమస్యలున్న దివ్యాంగులకు నిర్వహిస్తున్న ప్రత్యేక మెగా సదరం శిబిరంను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అక్కడి వైద్యులు, అధికారులతో మాట్లాడి తగు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ మానసిక వైకల్యంకు సంబంధించిన కేసులను ప్రత్యేకంగా మానసిక వైద్య నిపుణులు పరీక్షించి, సదరం ధ్రువీకరణ పత్రాలు జారీ చేయనున్నట్లు తెలిపారు. మానసిక వైకల్యానికి సంబంధం లేని ఇతర వైద్య సమస్యలతో వచ్చిన వారిని జనరల్ మెడిసిన్ విభాగానికి రిఫర్ చేసి, సంబంధిత వైద్యులు పరీక్షించి నిర్ణయం తీసుకుంటారని పేర్కొన్నారు. పక్షవాతం, ఇతర శారీరక అనారోగ్యాలు వంటి సమస్యలకు మానసిక వైకల్య ధ్రువీకరణ ఇవ్వడం సాధ్యం కాదని, అటువంటి వారు సంబంధిత వైద్య విభాగాన్ని సంప్రదించాలని సూచించారు. ప్రతి కేసును సంబంధిత వైద్యులు పూర్తిగా పరిశీలించిన అనంతరం మాత్రమే ధ్రువీకరణ పత్రం జారీ చేస్తారని తెలిపారు. శిబిరానికి వచ్చిన దివ్యాంగులకు టోకెన్ నంబర్లు కేటాయించి, సీరియల్ నంబర్ ప్రకారం లోపలికి పంపించి వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. శిబిరంలో అందుబాటులో ఉన్న స్లాట్లకు అనుగుణంగా లబ్ధిదారులను క్రమబద్ధీకరిస్తూ, రద్దీ లేకుండా ప్రత్యేక వసతులు ఏర్పాటు చేశామన్నారు. శిబిరం వద్ద అనవసరమైన రద్దీ లేకుండా, మానసిక వైకల్యానికి సంబంధించిన వారు మాత్రమే సంబంధిత విభాగంలో నమోదు చేసుకునేలా సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. ముందుగా స్లాట్ బుక్ చేసుకున్న 92 మంది దివ్యాంగుల్లో 58 మంది చిన్నారులు ఉన్నారని ఈనెల 23వ తేదీన కూడా శిబిరం ఉంటుందని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ పర్యటనలో డిఆర్డిఓ ముషాహిదా బేగం, డిపిఎం అరుణ, ఏపిఎం భీమన్న, డా. హేమలత, డా. ప్రదీప్, తదితరులున్నారు.

## తల్లిపాలే శిశువులకు సంపూర్ణ పోషణకు పునాది: - కలెక్టర్ ప్రియాంక :



**నారాయణపేట, సెప్టెంబర్,22, అక్షర కలం;**

నర్వ, సెప్టెంబర్ 22: పోషణ మాసం సందర్భంగా తల్లులు, బాలింతలు, చిన్నారుల కుటుంబ సభ్యులకు ఉత్తమ ఆహార పద్ధతులపై విస్తృత అవగాహన కల్పించాలని నారాయణపేట జిల్లా కలెక్టర్ సిహెచ్. ప్రియాంక సూచించారు. మంగళవారం నర్వ మండల రైతు వేదికలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 9వ జాతీయ పోషణ మాసం కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. శిశువు పుట్టిన వెంటనే తల్లి ఇచ్చే మొదటి పాలను (కొలస్ట్రం) తప్పనిసరిగా అందించాలని, ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని కలెక్టర్ స్పష్టం చేశారు. బాలింతలు పప్పులు, కూరగాయలు, పండ్లు, ప్రోటీన్‌తో కూడిన పోషకాహారం తీసుకోవాలని, ఆరు నెలల తర్వాత వయస్సుకు తగిన కాంప్లిమెంటరీ ఫుడ్‌ను క్రమంగా అందించాలని సూచించారు. అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు ఇంటింటి పర్యటనల్లో పోషణ, పరిశుభ్రత, చేతులు కడుక్కోవడం, సురక్షిత ఆహారంపై అవగాహన కల్పించాలని, బాల్య వివాహాలపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కోరారు. స్థానికంగా లభించే పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, పప్పులు వంటి సహజ పోషకాహారాన్ని వినియోగించి, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో నర్వ సర్పంచి హనుమంత్ రెడ్డి, డీడబ్ల్యూవో రాజేందర్ గౌడ్, జిల్లా వైద్య అధికారి డా. జయ చంద్రమోహన్, తహసిల్దార్ మల్లారెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, ఇన్‌ఛార్జ్ సీడీపీవో పాల్గొన్నారు.

## 70వ జిల్లా స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించిన డిప్యూటీ కలెక్టర్ భవ్య

అక్షర కలం సిద్దిపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 22 : జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో 70వ జిల్లా స్థాయి కబడ్డీ, ఖో-ఖో వాలీబాల్ టోర్నమెంట్ ను సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో మంగళవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిద్దిపేట శిక్షణ డిప్యూటీ కలెక్టర్ భవ్య హాజరై టోర్నమెంట్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ భవ్య మాట్లాడుతూ క్రమశిక్షణ పాటిస్తే క్రీడల్లో అంతర్జాతీయ స్థాయిలో రాణించవచ్చని, క్రీడాకారులను తీర్చిదిద్దడంలో మరియు పాఠశాల నిర్వహణలో వ్యాయామ ఉపాధ్యాయుల పాత్ర కీలకమని అన్నారు. ప్రారంభ కార్యక్రమంలో భవాని డాన్స్ అకాడమీ విద్యార్థులచే ప్రదర్శించిన భరతనాట్యం పేరిణి నృత్యాలు అందరినీ



ఆకట్టుకున్నాయి. ఈ టోర్నమెంట్ లో 26 మండలాల నుండి సుమారు 1300 మంది క్రీడాకారులు పాల్గొని పోటీపడుతున్నారని, క్రీడాకారులకు భోజన సౌకర్యం కల్పించామని, నైపుణ్యం ప్రదర్శించిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేసి జోనల్ టోర్నమెంట్ కు పంపిస్తామని జిల్లా ఎస్జిఎఫ్ సెక్రటరీ నర్రా భాస్కర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్, పంచాయతీరాజ్ శాఖ అధికారి రవీందర్, డీవైఎస్ఓ వీరారెడ్డి, సిద్దిపేట జిల్లా జూనియర్ కళాశాలల సెక్రటరీ సమ్మయ్య, వ్యాయామ ఉపాధ్యాయ సంఘాల అధ్యక్షులు ఏర్వ అశోక్, తోట సతీష్ కుమార్, జంగపల్లి వెంకట నర్సయ్య, జిల్లా సైక్లింగ్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## "నీట్‌లో సీటు సాధించిన ఆకాష్‌కు బీఆర్ఎస్ నాయకుల సన్మానం"



**నారాయణపేట, సెప్టెంబర్,22, అక్షర కలం:**

మరికల్ మండలం, కు చెందిన గొర్ల కాపరి (దండు) కొండప్ప కుమారుడు దండు ఆకాష్ ఇటీవల విడుదలైన వైద్య ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ఉన్నత ప్రతిభ కనబరిచి సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో వైద్య విద్య సీటు సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం మరికల్ మండల బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు, మూడవ వార్డ్ మెంబర్ సురిటి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆకాష్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆయనను శాలువాతో సత్కరించి, భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థి కష్టపడి చదివి వైద్య ప్రవేశ పరీక్షలో విజయం సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఆకాష్ సాధించిన విజయం కేవలం తల్లిదండ్రులకే కాకుండా మొత్తం మరికల్ మండలానికే గర్వకారణమని కొనియాడారు. గ్రామీణ ప్రతిభకు ప్రోత్సాహం అందించడం ద్వారా మరింత మంది విద్యార్థులు వైద్య, ఇంజినీరింగ్ వంటి ఉన్నత విద్యల వైపు చూడాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మరికల్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కుర్వ లంబడి తిరుపతయ్య, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, వార్డు సభ్యులు సురిటి చంద్రశేఖర్, మక్తల్ రాజారెడ్డి, లక్కాకుల శివకుమార్, సీమ నర్సింహా, సీనియర్ నాయకులు శెట్టి వీర బసంతయ్య, గౌని హన్మి రెడ్డి, సురిటి శ్రీనివాసులు, మాజీ కోఫ్షన్ సభ్యులు మజారుద్దిన్, హుస్సేన్, యువ నాయకులు కోయిలకొండ రఘు, గూప నర్సిములు, సురిటి హరీష్, బుగ్గప్ప, మల్లేష్, సీమ రాఘవేంద్ర, సీమ రాము, గూప అంజి, దండు కొండప్ప తదితరులు పాల్గొన్నారు. వైద్య ప్రవేశ పరీక్ష దేశవ్యాప్తంగా వైద్య విద్య ప్రవేశాలకు అర్హత పరీక్షగా నిర్వహిస్తారు. తెలంగాణలో కౌన్సెలింగ్ ప్రక్రియ ద్వారా మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయిస్తారు.

## భూ భారతి రీ-సర్వే పనులను వేగవంతం చేయాలి.....

**- కొమటూర్ గ్రామంలో క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆర్డీవో రమాదేవి....**

**మెదక్, సెప్టెంబర్ 22(అక్షర కలం)**

భూ భారతి కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న రీ-సర్వే పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మెదక్ ఆర్డీవో రమాదేవి అధికారులను ఆదేశించారు. మంగళవారం మెదక్ మండలంలోని కొమటూర్ గ్రామంలో భూ భారతి రీ-సర్వే పనులను ఆర్డీవో క్షేత్రస్థాయిలోపరిశీలించారు. రీ-సర్వే ప్రక్రియ, ఫీల్డ్ విజిట్ పనులను పరిశీలించారు. రీ-సర్వేలో భాగంగా భూముల హద్దులను క్షేత్రస్థాయిలో గుర్తించే ప్రక్రియను పరిశీలించి, సంబంధిత వివరాలను అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సర్వే



ప్రక్రియను పారదర్శకంగా, పక్కాగా నిర్వహించాలని ఆర్డీవో సూచించారు. భూముల హద్దుల గుర్తింపు సమయంలో సంబంధిత రైతులు, భూ యజమానుల సమక్షంలో వివరాలను పరిశీలించి, అవసరమైన చోట సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. రీ-సర్వే పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా క్షేత్రస్థాయిలో సర్వే బృందాలు సమన్వయంతో పనిచేసి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. రీ-సర్వే ద్వారా భూముల హద్దులు, రికార్డుల వివరాలు సక్రమంగా నమోదయ్యేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా రీ-సర్వేకు సంబంధించిన క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆర్డీవో సూచించారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం...

# జెన్-జిలో తగ్గని బీజేపీ క్రేజ్ !

ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థి సంఘం ఎన్నికల ఫలితాలు దేశవ్యాప్తంగా నవతరం యువత జెన్–జీ మనోగతంపై జరుగుతున్న ప్రచారాలకు తెరదించాయి. కేంద్రంలో బీజేపీ వరుసగా అధికారంలో ఉన్నందున .. ఉద్యోగాలు, నిరుద్యోగం, అగ్నివీర్ వంటి అంశాలను అడ్డంపెట్టుకుని జెన్–జీ ఓటర్లు బీజేపీ, ఆర్ఎస్ఎస్ భావజాలానికి క్రమంగా దూరమవుతున్నారంటూ ఇండియా కూటమి, వామపక్ష వర్గాలు చేసిన ప్రచారాలు డీయూ వేదికగా తేలిపోయాయి. ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థి సంఘం ఎన్నికల్లో నాలుగు కీలక పోస్టులలో మూడింటిని ఏబీవీపీ ఏకపక్షంగా కైవసం చేసుకోవడం ద్వారా.. దేశంలోని అత్యంత ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో నేటి తరం యువత ఇప్పటికీ బీజేపీ అనుబంధ సంస్థల వైపే అత్యంత బలంగా నిలబడుతోందని తేలిపోయింది.దేశ నలుమూలల నుంచి వివిధ నేపథ్యాలు, సంస్కృతులు, సామాజిక వర్గాలకు చెందిన ప్రతిభావంతులైన దాదాపు లక్షన్నర మందికి పైగా విద్యార్థులు ప్రాతినిధ్యం వహించే మినీ ఇండియాలాంటి క్యాంపస్ ఢిల్లీ విశ్వవిద్యాలయం. అలాంటి చోట స్వచ్ఛందంగా పోలింగ్ బూత్‌లకు వచ్చి ఏబీవీపీ అభ్యర్థులకు జైకొట్టారంటే.. యువ ఓటర్లు ఇప్పటికీ మోదీ మార్క్ జాతీయవాదం, స్థిరమైన అభివృద్ధి అజెండాకే పట్టం కడుతున్నారని రుజువవుతోంది. కేవలం భావోద్వేగ నినాదాలకే పరిమితం కాకుండా, లైబ్రరీ టైమింగ్స్ విస్తరణ, క్యాంపస్ స్పెషల్ మెట్రో ఫీడర్ బస్సులు, హాస్టల్ సదుపాయాలు, మహిళా భద్రత వంటి ప్రాక్టికల్ సమస్యలపై నిరంతరం పోరాడే ఏబీవీపీని విద్యార్థులు తమ గొంతుకగా ఎంచుకున్నారు.మరోవైపు ప్రతిపక్షాలు నిర్మించిన నెరేటివ్స్ క్యాంపస్‌లలో ఏమాత్రం పనిచేయలేదనడానికి ఈ ఫలితాలే ప్రత్యక్ష సాక్ష్యం. కాంగ్రెస్ విద్యార్థి విభాగం ఎన్ఎస్‌యూఐతో పాటు వామపక్ష కూటమి విద్యార్థుల మధ్య ప్రవేశపెట్టిన యాంటీ–బీజేపీ సెంటిమెంట్ క్షేత్రస్థాయిలో పటాపంచలైంది. చివరికి ఆ వ్యతిరేకత కాంగ్రెస్ అంతర్గత కుమ్ములాటలకే దారితీసి.. సొంత రెబల్ అభ్యర్థే రికార్డు మెజారిటీతో నెగ్గేలా చేసిందే తప్ప, వ్యవస్థీకృతంగా విద్యార్థులను ఆకట్టుకోవడంలో ప్రతిపక్షాలు ఘోరంగా బోల్తా పడ్డాయి. విద్యార్థులకు నిరంతరం అందుబాటులో ఉంటూ, క్యాంపస్‌లలో విశ్వసనీయత సంపాదించుకోవడంలో ఏబీవీపీ వేసిన రూట్ మార్చేలా చేయడంలో విపక్షాలు పూర్తిగా విఫలమయ్యాయి.ఈ ఎన్నికల సరళిని విశ్లేషిస్తే నవతరం ఓటర్లు కేవలం ప్రతిపక్షాల విమర్శలను గుడ్డిగా నమ్మడం లేదని, ఎవరు క్షేత్రస్థాయిలో పక్కాగా డెలివర్ చేయగలరనే ఆచరణాత్మక ఆలోచనతోనే ఓటేస్తున్నారని స్పష్టమైంది. జెన్–జీ ఓటు బీజేపీ నుంచి చేజారిపోతోందన్నది కేవలం సోషల్ మీడియా బబుల్స్‌లో సాగే ఊహాగానం మాత్రమేనని, వాస్తవ ఎన్నికల బ్యాలెట్ వద్దకు వచ్చేసరికి బీజేపీ భావజాలానికి నవతరం యువత తిరుగులేని మద్దతు లభిస్తోందని ఈ డీయూఎస్‌యూ తీర్పు బలంగా చాటిచెప్పింది. ఇప్పటివరకు ప్రధానంగా ఏకపక్ష సందేశాలకే పరిమితమైన ప్రచార విధానానికి బదులుగా.. ఇకపై యువతతో ద్విముఖ సంభాషణకు ప్రాధాన్యం ఇవ్వాలని బీజేపీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. యువతతో తమ పార్టీకి ఉన్న కమ్యూనికేషన్ లోటును జెన్–జీ ఉద్యమం స్పష్టంగా బయటపెట్టిందని బీజేపీ నేతలు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుత తరం బాధ్యతాయుతమైన సమాధానాలు కోరుతోందని వారు విశ్లేషిస్తున్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా ఒక్కటే పరిష్కారం కాదని, వ్యవస్థలో సమూల మార్పులు అవసరమనే భావన యువతలో బలంగా ఉందని పార్టీ గుర్తించినట్లు తెలుస్తోందిఎక్స్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు జెన్–జీని సమర్థంగా చేరుకోవడంలో ఆశించిన ఫలితాలు ఇవ్వడం లేదని బీజేపీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇదే సమయంలో ప్రతిపక్ష పార్టీలు ఈ వేదికలను మరింత సమర్థంగా వినియోగిస్తూ యువతను ఆకర్షిస్తున్నాయని బీజేపీ భావిస్తోంది. దీంతో సోషల్ మీడియా వ్యూహంలో మార్పులు తప్పనిసరి అయ్యాయని నేతలు చెబుతున్నారు. యువత ఎక్కువగా వినియోగించే ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్, రెడ్డిట్ మాధ్యమాల్లో పార్టీని బలోపేతం చేయాలని బీజేపీ యోచిస్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా యువకులతో కూడిన సోషల్ మీడియా బృందాలను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. దేశవ్యాప్తంగా ప్రతి జిల్లాలో ఇలాంటి బృందాలు ఉంటే ప్రభుత్వ విధానాలు, పార్టీ సందేశాలను యువతకు వారి భాషలో, వారికి నచ్చే శైలిలో చేరవేయవచ్చని బీజేపీ నాయకత్వం భావిస్తోంది. యువతతో సమర్థవంతంగా మాట్లాడాలంటే యువతే ప్రధాన పాత్ర పోషించాలని, పెద్దలు కూడా వారితో మాట్లాడేటప్పుడు వారి శైలినే అనుసరించాల్సి ఉంటుందని పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు. నరేంద్ర మోదీ వ్యవహరించిన తీరును పార్టీ ఉదాహరణగా చూపుతోంది. విద్యార్థుల ఆందోళనల సమయంలో ప్రధాని సెల్ఫీ వీడియోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేయడం యువతను దృష్టిలో పెట్టుకుని తీసుకున్న నిర్ణయమని పార్టీ నేతలు చెబుతున్నారు. యువత ఎక్కువ యాక్టివ్‌గా ఉండే సమయాన్ని, వారికి చేరువైన మాధ్యమాన్ని ఎంపిక చేసుకోవడం ద్వారా వారితో మమేకమయ్యే ప్రయత్నం చేశారని పేర్కొంటున్నారు. అంతేకాకుండా, కేంద్ర మంత్రులు కూడా ఇన్‌స్టాగ్రామ్‌లో మరింత చురుకుగా ఉండాలని, ప్రజలతో ఇంటరాక్టివ్‌గా వ్యవహరించాలని కేబినెట్ సమావేశంలో ప్రధాని సూచించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.ఇటీవల జరిగిన ఎన్డీయే ఎంపీల సమావేశంలో భారతదేశం వివిధ దేశాలతో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారు. యూపీఏ ప్రభుత్వ కాలంతో పోలిస్తే మోదీ ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాల వల్ల కలిగే ప్రయోజనాలను, చైనాతో పోలికలను, రాష్ట్రాల వారీగా లాభాలను వివరించారు. ఈ తరహా అంశాలను కేవలం గణాంకాల రూపంలో కాకుండా ఇన్‌స్టా రీల్స్, చిన్న వీడియోలు, గ్రాఫిక్స్, ప్లకార్డుల ద్వారా సులభంగా అర్థమయ్యే విధంగా యువతకు చేరవేయాలని పార్టీ ఆలోచిస్తోంది. ప్రభుత్వ విజయాలను ఆకర్షణీయమైన రూపంలో ప్రజెంట్



చేయడం ద్వారా యువతను మరింతగా ఆకట్టుకోవచ్చని భావిస్తోంది.నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంలో రీ–ఎగ్జామినేషన్ విజయవంతంగా నిర్వహించిన తర్వాత వివాదం తగ్గిపోతుందని భావించినప్పటికీ, అది జరగలేదని బీజేపీ నేతలు విశ్లేషిస్తున్నారు. దీనికి ప్రధాన కారణం ప్రభుత్వ చర్యలను విద్యార్థులకు సమర్థవంతంగా వివరించలేకపోవడమేనని వారు అంచనా వేస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా జెన్–జీతో నిరంతర, పారదర్శక, వేగవంతమైన కమ్యూనికేషన్ వ్యవస్థను రూపొందించేందుకు బీజేపీ కసరత్తు ప్రారంభించినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.రానున్న రాష్ట్ర ఎన్నికలతో పాటు జాతీయ రాజకీయాల్లోనూ బీజేపీ పట్ల యువత ఆకర్షణ చెక్కుచెదరలేదనడానికి ఈ ఫలితాలే గట్టి తార్కాణంగా నిలుస్తున్నాయన్న వాదన వినిపిస్తోంది.

# పాఠశాలల్లో డిజిటల్ విద్యా వనరులను సద్వినియోగం చేసుకోవాలి-జిల్లా కలెక్టర్ ప్రియాంక.

## --- జిల్లాలోని 29 పాఠశాలలకు 190 ల్యాప్ టాప్ ల పంపిణీ.

**నారాయణపేట, సెప్టెంబర్,22, అక్షర కలం:**



నారాయణపేట జిల్లాలో విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థలు అందిస్తున్న సహకారాన్ని పాఠశాలలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక తెలిపారు.మంగళవారం నారాయణపేట మండలంలోని జాజాపూర్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సేవా భారతి ఆధ్వర్యంలో సీఎస్ఆర్ ఇనిషియేటివ్ డిజిటల్ అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని 29 ఉన్నత పాఠశాలలకు ల్యాప్‌టాప్‌లు, డిజిటల్ విద్యా సామగ్రిని జిల్లా కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలోని పాఠశాలలు, విద్యార్థుల సంఖ్యను పరిశీలిస్తే నారాయణపేట జిల్లాకు విద్యారంగంలో ప్రత్యేక అవసరాలు, విస్తృత అవకాశాలు ఉన్నాయన్నారు. విద్యార్థులు తమ చదువుల కోసం ప్రధానంగా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులపై ఆధారపడుతున్నందున, వారికి మెరుగైన విద్యా వనరులు అందించడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు.సేవా భారతి వంటి సంస్థలు, సీఎస్ఆర్ (జశీతీజూశీతీ్వ ాశీఏఱఝశ్రీ =వంజూశీఅంఱఎఱశ్రీఱ్వ) నిధుల ద్వారా విద్యారంగానికి అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. గతంలో ప్రారంభమైన ల్యాప్‌టాప్‌ల అందజేత కార్యక్రమం కొంతకాలం సమన్వయం లోపంతో ముందుకు సాగలేదని, ప్రస్తుతం సంస్థ ప్రతినిధులతో సమన్వయం పూర్తవడంతో కార్యక్రమం తిరిగి కొనసాగడం సంతోషకరమన్నారు.వనరులను కేవలం భద్రపరచకుండా విద్యార్థుల అభ్యసనకు నిరంతరం వినియోగించాలని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ఆమె సూచించారు. అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా ఉపయోగించేందుకు కొంత అదనపు సమయం కేటాయించాలని కోరారు.భవిష్యత్ విద్యా విధానాల్లో డిజిటల్ సాంకేతికత, కృత్రిమ మేధస్సు (ఏ ఐ) కీలక పాత్ర పోషించే అవకాశం ఉన్నందున విద్యార్థుల్లో డిజిటల్ నైపుణ్యాలను పెంపొందించడం అత్యంత అవసరమని కలెక్టర్ అన్నారు. కొత్త సాంకేతికతపై విద్యార్థులకు భయం లేకుండా, వాటిని స్వయంగా ఉపయోగించేలా పాఠశాల స్థాయి నుంచే ప్రోత్సహించాలని సూచించారు.నారాయణపేట జిల్లాలో విద్యారంగంలో ఇప్పటికే అనేక సీఎస్ఆర్ కార్యక్రమాలు అమలవుతున్నాయని, భవిష్యత్‌లోనూ మరిన్ని సంస్థల సహకారాన్ని జిల్లాకు తీసుకురావడానికి జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు నారాయణపేట జిల్లాలో విద్యారంగ అభివృద్ధికి మరింతగా భాగస్వాములు కావాలని కలెక్టర్ కోరారు. జిల్లాలోని ఉపాధ్యాయులు విద్యార్థుల అభ్యసనలో చురుకుగా పనిచేస్తున్నారని, ప్రాథమిక విద్యా సామర్థ్యాల (ఎఫ్ ఎల్ ఎన్)తో పాటు పదో తరగతి ఫలితాల్లోనూ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచేలా కృషి చేస్తున్నారని తెలిపారు. సేవా భారతి, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు కార్యక్రమంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. అందించిన ల్యాప్‌టాప్‌లు, డిజిటల్ సామగ్రిని పూర్తిస్థాయిలో వినియోగించి విద్యార్థులకు మరింత మెరుగైన విద్య అందించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి గోవింద రాజులు, ఎంఈవో బాలాజీ, పాలమూరు సేవా భారతి సభ్యులు రాందేవ్ రెడ్డి, కిషన్ జీ, గ్రామ సర్పంచి సంగీత రాములు, ఉప సర్పంచి లక్ష్మణ్, పాఠశాల హెచ్ ఎం భారతీ, ఆర్ ఎస్ ఎస్ పాలమూరు కార్యవాహ మ్యాడమ్ ప్రభాకర్, ఆయా పాఠశాల హెచ్ ఎం లు తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో సెంట్రలైజ్ కిచెన్ ప్రారంభోత్సవానికి సిద్ధం..... - జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్......

**మెదక్, సెప్టెంబర్ 22(అక్షరకలం)**



ముఖ్యమంత్రి అల్పాహారం పథకం ద్వారా మెదక్ ,సిద్దిపేట, కామారెడ్డి జిల్లాలకు అల్పాహారం అందించే సెంట్రాలైజ్ కిచెన్ ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉందని జిల్లా కలెక్టర్ అన్నారు.మంగళవారం మెదక్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో తెలంగాణ ప్రభుత్వం ,హరే కృష్ణ మూమెంట్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న సెంట్రలైడు కిచెన్ ను పరిశీలించారు. కిచన్ సామాగ్రి, కిచెన్ యంత్రాలను పరిశీలించారు.కిచన్ యంత్రాల సామాగ్రి సామర్థ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ త్వరలో జిల్లా ఇంచార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి, ప్రజా ప్రతినిధులు చేతుల మీదుగా సెంట్రలైజ్ కిచెన్ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు పూర్తి అయిందన్నారు. ముఖ్యమంత్రి అల్పాహారం పథకం ద్వారా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు వర్తిస్తుందని, దీని ద్వారా పాఠశాలలో నాణ్యమైన చదువు తో పాటు పౌష్టికమైన అల్పాహారం కూడా అందుబాటులోకి వస్తుందన్నారు. మెదక్ జిల్లా వ్యాప్తంగా 395 పాఠశాలలోని,30 వేల మంది విద్యార్థులకు వర్తిస్తుందన్నారు. ఈ పథకం వల్ల ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపేతం అవుతాయని, త ద్వారా విద్యార్థుల సంఖ్య పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డి ఈ వో రాజు, తహసిల్దార్ లక్ష్మణ్ బాబు,మెదక్ కిచెన్ ప్లాంట్ మేనేజర్ పునీత్ త్రిపాఠి , హెచ్ కె ఎం ట్రస్ట్ ఆర్గనైజర్ వీర ,డిస్ట్రిబ్యూషన్ మేనేజర్ నవీన్ ,జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం బ్రేక్ ఫాస్ట్ ఇన్చార్జ్ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలకు 30 మంది ఎంపిక

**రాయికల్ సెప్టెంబర్ 22(అక్షర కలం):**



రాయికల్ మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన 30 మంది విద్యార్థులు మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ పారిపెల్లి గంగాధర్ తెలిపారు. 14 ఏళ్ల విభాగంలో జి.మానస, అయాన్, ధనిష్, మణికంఠ, నిశాంత్, హర్షవర్ధన్, సారిక, శ్రీరామ్, రమేష్, ప్రణతి ఎంపిక కాగా, 17 ఏళ్ల విభాగంలో ఎం.అవంతిక, అమూల్య, అర్చన, రిషికేష్, రేయాన్, రాము, జస్వంత్, హర్షవర్ధన్, రోహిత్, ప్రేమ్‌కుమార్ తదితరులు జిల్లా స్థాయికి అర్హత సాధించారు. విద్యార్థుల ఎంపికపై మండల విద్యాధికారి శ్రీపతి రాఘవులు హర్షం వ్యక్తం చేసి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పొన్నం రమేష్, రవీందర్, మల్లేశం, గంగాజమున, సత్యనారాయణ, తిరుమల, వనిత, పద్మజ, గంగాధర్, శ్రీకాంత్, యాస్మిన్ ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జన ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి

**.....శాంతియుతంగా శోభాయాత్ర లు నిర్వహించాలి**

**....భక్తులు, నిర్వాహకులు అధికారులకు సహకరించాలి**

**......జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్ లతో కలిసి ఏర్పాట్ల పరిశీలన**

**రాయికల్ సెప్టెంబర్ 22(అక్షర కలం):**



భక్తి శ్రద్ధలతో రాయికల్ పట్టణంలో వినాయక నిమజ్జన వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు. రాయికల్ పట్టణ శివారులోని వాగు వద్ద వినాయక నిమజ్జన వేడుకల కోసం మున్సిపల్, పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక ఇతర శాఖల ఆద్వర్యంలో చేస్తున్న ఏర్పాట్లను మంగళవారం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ

వినాయక మండపాల నిర్వాహకులు తమ విగ్రహాలను భక్తి శ్రద్ధల మధ్య వేడుకలు నిర్వహిస్తూ వైభవంగా తరలించాలని సూచించారు. ప్రతి ఒక్క నిర్వాహకులు అధికారులకు పూర్తి స్థాయిలో సహకరించాలని ఎటువంటి సంఘటనలు జరగకుండా శోభయాత్ర, నిమజ్జనం వేడుకలు చేసుకోవాలని కోరారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పక్కా ప్రణాళికతో వేడుకలను విజయవంతం చేయాలని ఆదేశించారు. వినాయక నిమజ్జనానికి కావలసిన, స్టేజ్, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, వైద్య సేవలు, అగ్ని మాపక శాఖ, మత్స్యశాఖ, అధికారులు సేవలు అందించాలని, నిమజ్జన ప్రదేశాల్లో పారిశుద్ధ్య పనులు చేయించాలని, భారీ క్రేన్లు, చిన్న క్రెన్ లు, గజ ఈతగాళ్ళు అవసరం మేరకు అందుబాటులో ఉంచుకోవాలని అవసరమైతే అదనంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పట్టణ వాసులతో పాటు భక్తులు, పిల్లలు తరలివచ్చే అవకాశం ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. నిమజ్జనం వేడుకలు భక్తులందరూ భక్తిశ్రద్ధలతో శాంతియుత వాతావరణంలో చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ పరిశీలనలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, డిఎస్పీ పురుషోత్తం రెడ్డి, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, ఎంపిడివో, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు నిమజ్జన పాయింట్‌ను పరిశీలించిన సిద్దిపేట సీపీ రష్మి పెరుమాళ్ ఐపీఎస్

**అక్షర కలం సిద్దిపేటసెప్టెంబర్22:**

సిద్దిపేట జిల్లావ్యాప్తంగా గణేష్ నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించనున్న నేపథ్యంలో, అధికారులు అన్ని ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ ఐపీఎస్ ఆదేశించారు. జిల్లాలో మొత్తం ముడువేయిలకు పైగా వినాయక విగ్రహాలు ప్రతిష్టించగా, నిమజ్జన బందోబస్తు పరిశీలనలో భాగంగా హుస్నాబాద్ పట్టణంలోని ఎల్లమ్మ చెరువు వద్ద ఏర్పాటు చేసిన నిమజ్జన పాయింట్‌ను సీపీ మంగళవారం క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, నిమజ్జనానికి సంబంధించి అవసరమైన అన్ని మౌలిక వసతులు, ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ అధికారులను సూచించారు. శోభాయాత్ర సమయంలో పట్టణంలో రద్దీ ఏర్పడకుండా, వాహన రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని హుస్నాబాద్ ఏసీపీ సదానందంను ఆదేశించారు. నిమజ్జన ప్రక్రియ సజావుగా సాగేందుకు వాలంటీర్లు పోలీసులకు పూర్తి స్థాయిలో సహకరించాలని, ఎలాంటి డీజే శబ్దాలు లేకుండా, భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు.ప్రజలందరూ పరస్పరం సహకరించుకుంటూ మతసామరస్యాన్ని కాపాడాలని, గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని కోరారు. సోషల్ మీడియాలో ఎలాంటి వదంతులు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు, అనుచిత పోస్టులను ప్రచారం చేయవద్దని, ఇతరుల మనోభావాలను దెబ్బతీసేలా ప్రవర్తించవద్దని హెచ్చరించారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ స్పష్టం చేశారు.





అక్షరకలం
తెలుగు దినపత్రిక

## ఆట



# బుమ్రాను ఎదుర్కొనేందుకు మా వద్ద వ్యూహాలు ఉన్నాయి

### ధీమా వ్యక్తం చేసిన ఆఫ్ఘనిస్థాన్ కెప్టెన్ ఇబ్రహీం జద్రాన్

గాయం నుంచి కోలుకుని తిరిగి జట్టులోకి వస్తున్న టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రాను ఎదుర్కోవడానికి తమ వద్ద ప్రత్యేక వ్యూహాలున్నాయని ఆఫ్ఘనిస్థాన్ కెప్టెన్ ఇబ్రహీం జద్రాన్ ధీమా వ్యక్తం చేశాడు. ఆదివారం (సెప్టెంబరు 13) అరుణ్ జైట్లీ స్టేడియంలో జరగనున్న తొలి టీ20కి ముందు జద్రాన్ మీడియాతో మాట్లాడాడు. బుమ్రా రాకతో భారత బౌలింగ్ విభాగం పటిష్ఠంగా మారినప్పటికీ, అతడిని సమర్థంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశాడు. "జస్ప్రీత్ బుమ్రా ప్రపంచంలోని అత్యుత్తమ బౌలర్లలో ఒకడు. నాకు ఇష్టమైన ఫాస్ట్ బౌలర్ కూడా అతడే. అయితే మేం ఏ విషయాన్నీ క్లిష్టంగా మార్చుకోం. అతడి కోసం మా వద్ద మంచి ప్రణాళిక ఉంది. అతడి బౌలింగ్‌ను ఎలా ఎదుర్కోవాలనే దానిపై స్పష్టమైన అవగాహనతో ఉన్నాం. బుమ్రాతో పాటు భారత జట్టుపైనా మెరుగైన ప్రదర్శన చేస్తామని ఆశిస్తున్నాం" అని జద్రాన్ తెలిపాడు. టీమిండియా యువ సంచలనం, లెఫ్ట్ హ్యాండ్ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీపై కూడా ప్రత్యేకంగా దృష్టి సారించామని జద్రాన్ వెల్లడించాడు. "ఐపీఎల్‌లో అతడిని ఎదుర్కొన్న మా జట్టు ఆటగాళ్ల నుంచి కీలక సమాచారం సేకరించాం. ఇప్పటికే అతడి వీడియోలను విశ్లేషించాం. సరైన సమయంలో సరైన ప్రణాళికలను అమలు చేయడంపైనే మా దృష్టి ఉంది" అని వివరించాడు. భారత్‌లో ఆడటం తమకు కొత్తేమీ కాదని, ఇక్కడి పరిస్థితులపై సంపూర్ణ అవగాహన ఉందని జద్రాన్ అన్నాడు. "గతంలో టీ20 ప్రపంచకప్, వన్డే ప్రపంచకప్‌లతో పాటు ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడాం. 2024లో బెంగళూరులో జరిగిన టీ20లో రెండు సూపర్ ఓవర్ల వరకు మ్యాచ్ సాగింది. భారత్‌పై మేం ఎప్పుడూ మెరుగైన క్రికెట్ ఆడాం. అయితే ఇప్పటివరకు వారిపై సిరీస్ గెలవలేదు. ఈసారి ఆ రికార్డును బద్దలు కొట్టి సిరీస్ గెలవడమే మా లక్ష్యం" అని పేర్కొన్నాడు. రషీద్ ఖాన్ నుంచి టీ20 కెప్టెన్సీ బాధ్యతలు స్వీకరించడంపై మాట్లాడుతూ, తమ మధ్య మంచి అవగాహన ఉందని, ఇది జట్టుకు మేలు చేస్తుందని తెలిపాడు. కొత్త కోచ్ రిచర్డ్ పైబస్ మార్గదర్శకత్వంలో జట్టు మరింత మెరుగవుతోందని, గతంలో తాము బలహీనంగా ఉన్న అంశాలపై దృష్టి సారించి మెరుగుపరుచుకుంటున్నామని వివరించాడు. భారత గడ్డపై వారికే ఆతిథ్యమివ్వడం తమ క్రికెట్ చరిత్రలో ఒక అపూర్వ ఘట్టం అని జద్రాన్ అభివర్ణించాడు. కెప్టెన్‌గా ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలి, సరైన సమయంలో సరైన నిర్ణయాలు ఎలా తీసుకోవాలనే దానిపై దృష్టి పెడుతున్నానని, ఈ కొత్త బాధ్యతను ఆస్వాదిస్తున్నానని అన్నాడు.




# గాయత్రీ , శ్రీకాంత్ లకు అర్జున అవార్డు..

కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ప్రతిష్టాత్మక నేషనల్ స్పోర్ట్స్ అవార్డ్స్ 2025 జాబితాను మంగళవారం అధికారికంగా ప్రకటించింది. తెలుగు తేజం, ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ కుమార్తె గాయత్రి, షూటర్ శ్రీకాంత్ లకు ప్రతిష్టాత్మక అర్జున అవార్డు దక్కింది. బ్యాడ్మింటన్ క్రీడాకారిణి అయిన గాయత్రీ, షూటర్ అయిన శ్రీకాంత్.. సాధించిన ఘనతలకు మెచ్చి, కేంద్రం ఈ పురస్కారం ప్రకటించింది. వీరితోతోపాటు మొత్తం 17 మంది అథ్లెట్లకు అర్జున అవార్డులు దక్కగా, ఒకరికి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ పురస్కారం లభించింది. అయితే ఈ అవార్డుల ప్రకటనలో అందరినీ ఆశ్చర్యపరిచిన అంశం దేశ అత్యున్నత క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న అవార్డుకు ఒక్కరి పేరు కూడా ఎంపిక కాకపోవడమే. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ (రిటైర్డ్) అరుణ్ కుమార్ మిశ్రా నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ ఇచ్చిన సిఫార్సుల ఆధారంగా ప్రభుత్వం ఈ అవార్డులను ఖరారు చేసింది. గత నాలుగేళ్ల కాలంలో అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన ఆటగాళ్లకు ఖేల్ రత్న పురస్కారాన్ని అందిస్తుంటారు. 2024 లో చెస్ వరల్డ్ ఛాంపియన్ గుకేశ్ దొమ్మరాజు, ఇండియన్ మెన్స్ హాకీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, పారా అథ్లెట్ ప్రవీణ్ కుమార్, ఒలింపిక్ మెడలిస్ట్ మను భాకర్ లకు ఖేల్ రత్న లభించింది. కానీ 2025 అవార్డుల సైకిల్‌లో ఏ ఒక్క క్రీడాకారుడి పేరును కమిటీ నామినేట్ చేయకపోవడంతో ఈ అత్యున్నత గౌరవ జాబితా ఖాళీగా మిగిలిపోయింది. గత నాలుగేళ్లలో నిలకడైన ప్రతిభ, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ ప్రదర్శించిన వారికి అర్జున అవార్డులను ప్రకటించారు. హైజంపర్ తేజస్విన్ శంకర్, స్ప్రింటర్లు మహమ్మద్ అజ్మల్, ప్రియాంక గోస్వామి, బ్యాడ్మింటన్ డబుల్స్ స్టార్స్ త్రీసా జాలీ, చెస్ గ్రాండ్‌మాస్టర్లు విదిత్ గుజరాతి, దివ్య దేశ్‌ముఖ్, హాకీ స్టార్లు లాల్‌రెమ్‌సియామి, రాజ్‌కుమార్ పాల్, షూటర్ అఖిల్ షెరాన్ ఈ ప్రతిష్టాత్మక అవార్డును దక్కించుకున్నారు. వీరితో పాటు పారా షూటర్ రుద్రాంశ్ ఖండేల్వాల్, పారా అథ్లెట్ ఏక్తా భ్యాన్, రోయింగ్ ప్లేయర్ అరవింద్ సింగ్, బాక్సర్ నరేందర్, కబడ్డీ ప్లేయర్లు సుర్జీత్, పూజ, డెఫ్ షూటర్ ధనుష్ శ్రీకాంత్.. అర్జున అవార్డు గ్రహీతల జాబితాలో నిలిచారు. 1962 ఆసియా క్రీడల్లో గోల్డ్ మెడల్ సాధించిన భారత ఫుట్‌బాల్ టీమ్ సభ్యుడు ఐ. అరుమై నాయగం కు లైఫ్‌టైమ్ కేటగిరీలో అర్జున అవార్డు దక్కింది. కోచ్ లకు ఇచ్చే ద్రోణాచార్య అవార్డుల రెగ్యులర్ కేటగిరీలో అథ్లెటిక్స్ కోచ్ పర్వీర్ సింగ్, బాక్సింగ్ కోచ్ ఛోటే లాల్ యాదవ్, షూటింగ్ కోచ్ నేహా నందకుమార్ చవాన్ ఎంపికయ్యారు.

# ఇంగ్లాండ్ గడ్డపై పాక్‌కు ఘోర పరాభవం..

ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరిగిన మూడో టెస్టులో ఇంగ్లాండ్ జట్టు 8 వికెట్ల తేడాతో పాకిస్థాన్‌ను చిత్తు చేసింది. ఈ విజయంతో మూడు టెస్టుల సిరీస్‌ను 3–0తో క్లీన్ స్వీప్ చేసి పాకిస్థాన్‌కు ఘోర పరాభవాన్ని మిగిల్చింది. కెప్టెన్‌గా జో రూట్ రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన తర్వాత తొలి సిరీస్‌నే క్లీన్ స్వీప్ చేయడం గమనార్హం. తొలి రెండు టెస్టులతో పోలిస్తే.. మూడో టెస్టులో పాక్ కాస్త పోరాడినా ఓటమిని మాత్రం తప్పించుకోలేకపోయింది. దీంతో నాలుగు రోజుల్లోనే టెస్ట్ మ్యాచ్ ముగిసింది. 130 పరుగుల స్వల్ప లక్ష్యంతో నాలుగో రోజు ఆట ప్రారంభించిన ఇంగ్లాండ్‌కు పాకిస్థాన్ పేసర్ మహమ్మద్ అబ్బాస్ షాక్ ఇచ్చాడు. తొలి బంతికే డకెట్‌ను డకౌట్‌గా వెనక్కి పంపిన అబ్బాస్, అదే ఓవర్లో ఎమిలియో గేని కూడా పెవిలియన్ చేర్చాడు. కేవలం 2 పరుగులకే 2 వికెట్లు కోల్పోయిన ఇంగ్లాండ్‌పై పాక్ పైచేయి సాధించినట్లు కనిపించింది. అబ్బాస్ తన కట్టుదిట్టమైన స్పెల్‌తో ఇంగ్లాండ్ బ్యాటర్లను ఒత్తిడిలోకి నెట్టాడు.అయితే కెప్టెన్ జో రూట్, జోర్డాన్ కాక్స్ కలిసి ఇంగ్లాండ్‌ను ఆదుకున్నారు. పాకిస్థాన్ బౌలర్ల దాడిని తట్టుకుంటూ నెమ్మదిగా స్కోరు బోర్డును ముందుకు నడిపారు. ఈ క్రమంలో పాకిస్థాన్ చేసిన పొరపాట్లు రూట్‌కు బాగా కలసివచ్చాయి.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

## సినిమా
CINEMA



# త్రివిక్రమ్‌తో మా బంధం బలమైనది

### సూర్యదేవర నాగవంశీ వెల్లడి

ఒక బ్యానర్‌లో పనిచేసే వ్యక్తుల మధ్య మంచి అనుబంధం ఏర్పడితే.. అదే బంధం కొనసాగుతుందని, దానికి ప్రత్యేకమైన అగ్రిమెంట్లు అవసరం లేదని ఆయన పేర్కొన్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నాగవంశీ.. నిర్మాతల కాంపౌండ్స్, దర్శకుడు త్రివిక్రమ్‌తో తమ కుటుంబానికి ఉన్న అనుబంధం గురించి ఆసక్తికర విషయాలను వెల్లడించారు. డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో వారి కుటుంబానికి ఉన్న అనుబంధం గురించి నాగవంశీ మాట్లాడుతూ.. తన బాబాయి (చిన్నబాబు) ఇండస్ట్రీలోకి రావాలని అనుకున్న సమయంలో తొలి సినిమాను త్రివిక్రమ్ దర్శకత్వంలోనే చేయాలని కోరుకున్నారని తెలిపారు. త్రివిక్రమ్ పనితీరు, సినిమాలపై ఆయనకు ఉన్న అభిమానం కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. ఆ సమయంలో 'జులాయి' సినిమా ప్రారంభమైనప్పటి నుంచి త్రివిక్రమ్‌తో తమ అనుబంధం మరింత బలపడిందని నాగవంశీ పేర్కొన్నారు. 'హారిక అండ్ హాసిని క్రియేషన్స్' అనే బ్యానర్ పేరును కూడా త్రివిక్రమే సూచించారని, ఆ బ్యానర్ లోగోను సైతం ఆయనే డిజైన్ చేశారని వెల్లడించారు. 'అప్పటి నుంచి ఇప్పటివరకు త్రివిక్రమ్ బయట బ్యానర్‌లో సినిమా చేయలేదు. దీనికి ఎలాంటి అగ్రిమెంట్లు లేవు. మా మధ్య ఉన్న రిలేషన్‌షిప్ అలాంటిది. ఒక ఫ్యామిలీలా అయిపోయాం' అని నాగవంశీ చెప్పుకొచ్చారు.

త్రివిక్రమ్ తమ బ్యానర్‌తోనే వరుసగా సినిమాలు చేస్తూ ప్రయాణం కొనసాగిస్తున్న నేపథ్యంలో.. తమ వైపు నుంచి కూడా ఆయనకు ఎక్స్‌క్లూజివిటీ ఇవ్వడం సహజమేనని నాగవంశీ అన్నారు. 'హారిక అండ్ హాసిని క్రియేషన్స్' బ్యానర్‌ను ప్రధానంగా త్రివిక్రమ్ సినిమాల కోసం కొనసాగిస్తున్నట్లు వివరించారు. అయితే త్రివిక్రమ్‌కు ఆ బ్యానర్‌లో వాటా ఉందనే ప్రచారంపై కూడా నాగవంశీ క్లారిటీ ఇచ్చారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్‌లో త్రివిక్రమ్‌కు ఎలాంటి షేర్ లేదని, ఆయనకు రెమ్యునరేషన్ మాత్రమే ఉంటుందని స్పష్టం చేశారు. ఆయనకు సంబంధించిన షేర్ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌లో ఉంటుందని తెలిపారు. అలాగే సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌కు సంబంధించిన ప్రాజెక్టుల్లో త్రివిక్రమ్ కీలకంగా భాగస్వామ్యం అవుతున్నారని, స్క్రిప్టులు, ఇతర సినిమా విషయాల్లో ఆయన సలహాలు కూడా తీసుకుంటామని నాగవంశీ వెల్లడించారు. త్రివిక్రమ్‌తో తమ బంధం కేవలం సినిమాలకు సంబంధించినది మాత్రమే కాదని.. సంవత్సరాలుగా కొనసాగుతున్న అనుబంధమే తమ ప్రయాణానికి కారణమని నాగవంశీ చెప్పుకొచ్చారు.



# కొరియన్ కనకరాజుతో హిట్ కొట్టిన వరుణ్ తేజ్

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్‌కు గత కొంతకాలంగా హిట్ కోసం ఎదురుచూస్తున్నారు. తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'కొరియన్ కనకరాజు' వరుణ్ తేజ్‌కు భారీ ఊరటనిచ్చేలా బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్తోంది. మేర్లపాక గాంధీ దర్శకత్వం వహించిన ఈ హారర్ కామెడీ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితిక నాయక్ హీరోయిన్‌గా నటించింది. సత్య కీలక పాత్రలో కనిపించారు. విడుదలకు ముందు నుంచే మంచి బజ్‌ను సొంతం చేసుకుంది. తాజా సమాచారం ప్రకారం 'కొరియన్ కనకరాజు' ప్రీమియర్స్, తొలి రోజు కలిపి రూ.10.2 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసినట్లు చిత్ర బృందం ప్రకటించింది. హారర్ కామెడీ జోనర్‌లో తెరకెక్కిన సినిమాకు ఇది మంచి ఓపెనింగ్‌గా చెప్పొచ్చు. అంతేకాదు.. వరుణ్ తేజ్ కెరీర్‌లో ఇదే బిగ్గెస్ట్ ఓపెనర్గా నిలిచినట్లు మేకర్స్ వెల్లడించారు. గతంలో వరుణ్ తేజ్‌కు అత్యధిక ఓపెనింగ్ అందించిన 'గద్దలకొండ గణేష్' సినిమాను 'కొరియన్ కనకరాజు' అధిగమించింది. దీంతో చాలా కాలం తర్వాత వరుణ్ తేజ్ అభిమానుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది.దేశీయ మార్కెట్‌తో పాటు ఓవర్సీస్‌లోనూ సినిమా మంచి ఆరంభాన్ని అందుకుంది. ముఖ్యంగా అమెరికాలో ఇప్పటివరకు 1.75 లక్షల డాలర్ల గ్రాస్ సాధించినట్లు సమాచారం.

# 1 బిలియన్ కలెక్షన్ల క్లబ్‌లో చేరిన ది ఒడిస్సీ

హాలీవుడ్ ప్రముఖ దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ తెరకెక్కించిన తాజా విజువల్ వండర్ 'ది ఒడిస్సీ' బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. థియేటర్లలో విడుదలైన మూడు వారాల్లోనే ఈ ఫాంటసీ యాక్షన్ డ్రామా ప్రపంచవ్యాప్తంగా 1 బిలియన్ కలెక్షన్ల క్లబ్‌లో (దాదాపు రూ.9,500 కోట్లకు పైగా) అడుగుపెట్టింది క్రిస్టోఫర్ నోలన్ కెరీర్‌లో 1 బిలియన్ మార్కును అందుకున్న మూడో చిత్రంగా 'ది ఒడిస్సీ' నిలిచింది. అంతకుముందు ఆయన దర్శకత్వం వహించిన 'ది డార్క్ నైట్' (1.008 బిలియన్), 'ది డార్క్ నైట్ రైజెస్' (1.08 బిలియన్) ఈ ఘనత సాధించాయి. గతేడాది వచ్చిన 'ఓపెన్‌హైమర్' ఈ మార్కుకు కాస్త దూరంలో ఆగిపోయింది. కాగా, ఈ వీకెండ్ ముగిసేసరికి 'ది ఒడిస్సీ' నోలన్ కెరీర్‌లోనే అత్యధిక కలెక్షన్లు సాధించిన చిత్రంగా నిలవడం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఒక్క ఐమాక్స్ స్క్రీన్ల నుంచే ఏకంగా 257 మిలియన్ డాలర్ల వసూళ్లు (దాదాపు రూ.2,445 కోట్లు) రావడం విశేషం. త్వరలోనే ఐమాక్స్ చరిత్రలోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగానూ ఇది నిలవనుంది.



అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

## ఘన్ముక్లలో భక్తిశ్రద్ధలతో గణపతి నవరాత్రి వేడుకలు



**వీణవంక, సెప్టెంబర్ 22 ( అక్షర కలం ):**

వీణవంక మండలం ఘన్ముక్ల గ్రామంలోని శ్రీ భవానిశంకర స్వామి దేవాలయంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం వీణవంక ఎస్సై ఆవుల తిరుపతి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించి ఆశీర్వాదం పొందారు. అనంతరం ఆలయ నిర్వాహకులు, గ్రామ ప్రజలు, మహిళలతో కలిసి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై ఆవుల తిరుపతి మాట్లాడుతూ, గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. నిమజ్జనం సందర్భంగా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహించుకోవాలని కోరారు. యువత నిమజ్జన సమయంలో అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జిన్నారపు శివకుమార్, గ్రామ సర్పంచ్ గాజుల శంకర్, గ్రామ ప్రజలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## అంజనీపుత్ర ఎస్టేట్ ఆధ్వర్యంలో ఘనంగా గణనాథుని ఉత్సవాలు

**వరసిద్ధి వినాయకుడిని దర్శించుకున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరకంటి చందర్**

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 22:**

జిల్లా కేంద్రమైన మంచిర్యాల పట్టణంలోని చున్నంబట్టివాడ 100 ఫీట్ల రోడ్డులో అంజనీపుత్ర ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో వారి కార్యాలయం సమీపంలో గణపతి నవరాత్రి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్నారు. అంజనీ పుత్ర ఆధ్వర్యంలో



ఏర్పాటుచేసిన వరసిద్ధి వినాయకుడిని మంగళవారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరకంటి చందర్ లు దర్శించుకుని, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, అంజనీపుత్ర ఎస్టేట్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం భక్తిశ్రద్ధలతో గణేష్ ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కాలనీవాసులంతా ఐక్యంగా ఒకచోట చేరి ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషకరమని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు ప్రజల్లో ఐకమత్యం, సోదరభావాన్ని పెంపొందించడంతోపాటు ప్రశాంత వాతావరణానికి దోహదం చేస్తాయన్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా తొమ్మిది రోజులపాటు నిరంతరంగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. వినాయక నిమజ్జనాన్ని కుల, మతాలకు అతీతంగా సామరస్యంతో సంతోషంగా జరుపుకోవాలని తెలిపారు. శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలుగకుండా అందరూ కలిసి జరుపుకోవాలని, నిమజ్జన ప్రాంతాలలో నిబంధనల ప్రకారం జాగ్రత్తలు వహించాలని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కోరకంటి చందర్ మాట్లాడుతూ, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో సమాజంలో ఐక్యత, సద్భావన మరింత పెరుగుతాయని ఆకాంక్షించారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తున్న నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, కాలనీవాసులు, భక్తులను అభినందించారు. ఈ పవిత్ర కార్యక్రమంలో తనను భాగస్వాములను చేసి, స్వామివారి సేవలో పాల్గొనే అవకాశం కల్పించిన అంజనీపుత్ర ఎస్టేట్ చైర్మన్ గుర్రాల శ్రీధర్ కు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అంజనీపుత్ర ఎస్టేట్ చైర్మన్ గుర్రాల శ్రీధర్ వారిని శాలువాతో ఘనంగా సన్మానించి, శ్రీమద్భగవద్గీత పుస్తకాలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో అంజనీపుత్ర ఎస్టేట్ నిర్వాహకులు, కాలనీ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

## బిబినగర్ ఎంఈఓకు శాలువాతో ఘన సన్మానం

**అక్షరకలం బీబీనగర్**

బిబినగర్ మండల విద్యాశాఖాధికారి ని బడ్జెట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ యాదాద్రి భువనగిరి జిల్లా, బిబినగర్ మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ?ఈ సందర్భంగా మండలంలో విద్యారంగ అభివృద్ధి, పాఠశాలల నిర్వహణతో పాటు పలు విద్యాసంబంధిత అంశాలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. అనంతరం ఎంఈఓ ని సంఘ నాయకులు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బడ్జెట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు పి. మల్లేష్ గౌడ్, బిబినగర్ మండల అధ్యక్షులు కోనార్క్ రావు, ప్రధాన కార్యదర్శి శ్రీ కాశీ విశ్వనాథ్, కరస్పాండెంట్ సత్యనారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.



# పోషకాహారంతో ఆరోగ్యకరమైన సమాజం

**చిట్యాల, సెప్టెంబర్ 22 (అక్షర కలం)**



నల్గొండ జిల్లా చిట్యాల మండలం ఏపూరు గ్రామంలో సమగ్ర శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమాన్ని పురస్కరించుకుని మంగళవారం పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏపూరు అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, తల్లిదండ్రులు, గర్భిణులు, బాలింతలు, మహిళలు, చిన్నారుల తల్లిదండ్రులకు సమతుల్య పోషకాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పాలెం మహేష్ గౌడ్, మునుగోడు ప్రాజెక్టు సీడీపీఓ లావణ్య కుమారి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికలు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. స్థానికంగా లభించే ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, గుడ్లు, పాలు తదితరాలను రోజువారీ ఆహారంలో భాగంగా చేసుకోవాలని తెలిపారు. గర్భిణులు, బాలింతలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి వైద్యుల సూచనలు పాటించాలని, గర్భస్థ శిశువు ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తల్లి తీసుకునే సమతుల్య ఆహారం ఎంతో కీలకమని వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న బాలామృతం, గుడ్లు, పాలు, ఆరోగ్యలక్ష్మి భోజనాన్ని లబ్ధిదారులు క్రమం తప్పకుండా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీత, ఉపాధ్యాయుడు శివ, ఏఎన్ఎం మల్లేశ్వరి, గ్రామ పెద్దలు, తల్లులు, అంగన్‌వాడీ టీచర్లు డి. ధనలక్ష్మి, ఎన్. హంసమ్మ తదితరులు పాల్గొన్నారు.

# యువత చేతిలో మన సంస్కృతి

**--పర్యాటక ప్రదేశాల సందర్శనతో చారిత్రక సాంస్కృతిక విజ్ఞానం**

**-- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి**

**ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం**





తెలంగాణలోని ముఖ్యంగా నల్లగొండ జిల్లాలోని పర్యాటక ప్రదేశాలను సందర్శించడం వల్ల విద్యార్థులకు చారిత్రక, సాంస్కృతిక విజ్ఞానం కలుగుతుందని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి అన్నారు. మంగళవారం ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకల్లో భాగంగా నాగార్జున ప్రభుత్వ కళాశాలలో జిల్లా స్థాయి 'యువ టూరిజం క్లబ్' పోటీలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ జిల్లా పర్యాటక శాఖ, జిల్లా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో, తెలంగాణ టూరిజం సహకారంతో 'యువ టూరిజం క్లబ్' ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సాంస్కృతిక పోటీలు నిర్వహించబడుతున్నాయని అన్నారు. వారసత్వం, సమాజ ప్రోత్సాహం అనే నినాదంతో ఈ కార్యక్రమం చేపట్టడం జరుగుతున్నదని అన్నారు. ఈ జిల్లా స్థాయి కళాశాల పోటీలలో భాగంగా షార్ట్ ఫిలిం, రీల్ పోటీలు, సోషల్ మీడియా టూరిజం క్యాంపెయిన్, టూరిజం అవేర్‌నెస్ స్కిల్స్, పాటలు, నృత్యం, మరియు డ్రామా వంటి వివిధ అంశాలు నిర్వహించడ్డాయి. అలాగే తక్కువ ప్రాచుర్యం పొందిన పర్యాటక ప్రదేశాలు, మరుగన పడిన కళలు, స్థానిక భాగస్వామ్యంతో కూడిన వినూత్న ఆలోచనలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. సాయంత్రం జరిగిన బహుమతి ప్రధానోత్సవంలో నల్లగొండ నగర మేయర్ బుర్రి చైతన్య రెడ్డి పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. సముద్రాల ఉపేందర్, అడిషనల్ ఎస్పీ జి రమేష్, నల్గొండ డిస్టిక్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ దస్రు నాయక్, జిల్లా పంచాయతి అధికారి తరుణ్ చక్రవర్తి, నల్లగొండ జిల్లాడిప్యూటీ మేయర్ అష్రాఫ్ అలీ, కార్పొరేటర్ సమద్ ఎండి. ఇంతియాజ్, జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎండి. అక్బర్ అలీ న్యాయ నిర్ణేతలుగా తెలుగుశాఖ అధ్యక్షులు డా. వెల్దశీడి శ్రీధర్, డా. ఎండి హసేనా జిల్లాలోని వివిధ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గురువే దారి

**ప్రగతి భవిష్యత్తుకు నల్గొండే నాంది !**

**మార్కులు మాత్రమే కాదు... విలువలు నేర్పాలి**

**ఉత్తమ ఉపాధ్యాయుల వేడుకలో మంత్రి కోమటిరెడ్డి పిలుపు**

**టీచర్ల కష్టానికి మంత్రి ప్రశంసలు**

**ఘనంగా ఉత్తమ ఉపాధ్యాయుల సన్మానం**

**రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా బడులు**

**విద్యార్థుల ప్రగతే లక్ష్యంగా విద్యా విప్లవం**

**ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం**

విద్యార్థుల జీవితాలు మార్చేది గురువులేనని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం నల్గొండ జిల్లా కేంద్రంలోని లక్ష్మీ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 2026 ఉత్తమ ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఉపాధ్యాయులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ నల్గొండ జిల్లాలో ఉపాధ్యాయులు ఎంతో కృషి చేస్తున్నారని, గత సంవత్సరములతో పోలిస్తే ఈ సంవత్సరం రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల నమోదు శాతం 10 శాతం తగ్గగా, నల్గొండ జిల్లాలో మాత్రం 9శాతం పెరిగిందని, ఇది జిల్లా ఉపాధ్యాయుల పనితీరుకు నిదర్శనమన్నారు. ప్రభుత్వ పాఠశాలల ద్వారా మెరుగైన విద్యను అందిస్తున్నప్పటికీ చాలామంది విద్యార్థులు ప్రైవేట్ కు వెళ్తున్నారని, ప్రైవేటు పాఠశాలల్లో బట్టి విధానం, ఇంగ్లీష్ మీడియం వంటివి ప్రభావం చూపిస్తున్నాయని, ప్రభుత్వ పాఠశాలల్లో మంచి ఉపాధ్యాయులు ఉన్నారని, విద్యార్థులు ప్రైవేట్ పట్ల మొగ్గ







చూపడం పై అందరు ఆలోచించాల్సిన అవసరం ఉందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిందని, ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు ,తెలంగాణ పబ్లిక్ స్కూల్ ల ఏర్పాటు చేస్తున్నామని, నల్గొండలో 200 కోట్ల రూపాయలతో చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులు 50 శాతం పూర్తయ్యాయని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 12,000 మంది టీచర్ లను కొత్తగా నియమించిందని, అవసరమైతే మరికొంతమందిని నియమిస్తామని, ఉపాధ్యాయులు పిల్లలకు విద్యను అందించడంతోపాటు, వారికి ఆరోగ్యం, జీవిత లక్ష్యాలు నేర్పించాలని మంత్రి సూచించారు. పదవ తరగతి తర్వాత ఇంటర్ విద్యలో ఎక్కువమంది ఫెయిల్ అవుతున్నారని దీనిపై దృష్టి సారించాలని, అలాగే మధ్యలోనే బడి మానేసేవారి వివరాలను సేకరించి అందుకు గల కారణాలను విశ్లేషించాల్సిందిగా జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు.

**సృజనాత్మకత వెలికి తీయడంలో కీలక పాత్ర....**

జిల్లా కలెక్టర్ బి .చంద్రశేఖర్ మాట్లాడుతూ సృజనాత్మకతను వెలికితీస్తూ, సోషల్ మీడియా ప్రభావం నుంచి విద్యార్థులను కాపాడి సరైన మార్గంలో నడిపించాలని సూచించారు. విద్యార్థుల ప్రతిభ, పురోగతిపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు సమీక్షించాలి.?విద్యాభివృద్ధి: జిల్లాలో 2,000 మంది విద్యార్థులు పెరిగారు. 'అమ్మ ఆదర్శ పాఠశాలలు', 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్', 'తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు' ద్వారా మెరుగైన విద్య అందిస్తాం.? సీఎం పర్యటన కారణంగా సెప్టెంబర్ 5న జరగాల్సిన వేడుక ను మంగళవారం నిర్వహిస్తున్నామని వివరించారు. జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ మాట్లాడుతూ విద్యార్థుల మార్కులు, రిజల్ట్స్ కాకుండా వారికి విలువలు, గౌరవం నేర్పించాలని, పిల్లలు సామాజిక మాధ్యమాల ద్వారా చెడు మార్గాన పయనించకుండా టీచర్లు, తల్లిదండ్రులు నైతిక విలువలు పెంపొందించాలన్నారు.

---ఎమ్మెల్సీలు మాట్లాడుతూ....ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ చదువుతో విద్యార్థుల జీవితాలు మారతాయని, చదువు విద్యార్థుల జీవితానికి వెలుగునిస్తుందని, ఉపాధ్యాయులు అకుంఠిత దీక్షతో పనిచేసి వారి అభివృద్ధికి తోడ్పాటును అందించాలన్నారు.మరో ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా పని చేస్తూ రాష్ట్రపతిగా సేవలు అందించి చివరి శ్వాస వరకు ఉపాధ్యాయుడుగా కృషి చేసిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఉపాధ్యాయులు వారి వృత్తికి పునరంకితం కావాలన్నారు. నల్గొండ మున్సిపల్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో గురువులకు గొప్ప స్థానం ఉందని, విద్యార్థులకు దిశా, నిర్దేశం చేసేది, విలువలు నేర్పేది, దేశ అభివృద్ధిని పెంపొందించడంలో గురువుల బాధ్యత ఎంతో ఉందన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి సుసిందర్ రావు సమర్పించిన తన నివేదికలో ఈ సంవత్సరం జిల్లాల్లో తొమ్మిది శాతం విద్యార్థులు నమోదు పెరిగిందని, జిల్లాలోని ఉపాధ్యాయులు పాఠశాల పని గంటలకు అదనంగా గంటన్నర పనిచేస్తున్నారని చెప్పారు. డిప్యూటీ మేయర్ అమీర్ అలీ, కార్పొరేటర్ గుమ్మల జానకి, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.



అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# ఉత్తమ కార్పొరేషన్ అవార్డే లక్ష్యం

## -- నల్గొండలో స్వీపింగ్ మెషిన్లను ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి

ఉమ్మడి నల్లగొండ బ్యూరో అక్షరకలం




నల్గొండ కార్పొరేషన్ లో అన్ని సౌకర్యాలు కల్పించి స్మార్ట్ సిటీ గా తీర్చిదిద్దడమే కాక బెస్ట్ కార్పొరేషన్ అవార్డు కూడా అందుకుంటామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. మంగళవారం అయన నల్గొండ జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయం ఇందిరాభవన్ వద్ద నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ లో పరిశుభ్రతకు సంబంధించి కోటి 1 లక్ష రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన రెండు వెట్టింగ్ మెషిన్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఇటీవల నల్గొండ కార్పొరేషన్ స్వచ్ఛ అవార్డు అందుకుందని, నూతనంగా ఏర్పాటైన నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ లోని ప్రజలకు అన్ని రకాల సేవలు అందించేందుకు కృషి చేయడం జరుగుతున్నదని, ముఖ్యంగా 24 గంటలు తాగునీరు అందించేందుకు 83 కోట్ల రూపాయలతో టెండర్లు కూడా పిలవడం జరిగిందన్నారు. నల్గొండ కార్పొరేషన్లో ఎస్ డి ఎఫ్ నిధులతో 63 కిలోమీటర్ల సీసీ రోడ్లు వేశామని, అలాగే తక్కిన డివిజన్లలో కూడా రోడ్లతో పాటు, డ్రైన్లు నిర్మిస్తామని, 6 నెలల్లో ఎస్టిపి పూర్తి చేయనున్నట్లు మంత్రి తెలిపారు. నల్గొండ కార్పొరేషన్ కు అన్ని రకాల నిధులను తీసుకువచ్చి అభివృద్ధి చేసి ఉత్తమ కార్పోరేషన్ అవార్డు కూడా తీసుకుంటామనే నమ్మకం తనకున్నట్టు మంత్రి తెలిపారు. నల్గొండ కార్పొరేషన్ పరిధిలో 900 కోట్ల రూపాయలతో ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం చేపట్టామని, అలాగే డ్రైనేజీ ,ఎస్ టి పి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ అమీర్ అలీ,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ,ఆర్ అండ్ బి అధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

# నేడు విద్యాసంస్థలకు స్థానిక సెలవు

## -- జిల్లా కలెక్టర్ చంద్ర శేఖర్

అక్షరకలం నల్గొండ

గణేష్ నిమజ్జనం సందర్భంగా నేడు నల్గొండ జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పాఠశాలలు, కళాశాలలు మరియు ప్రైవేట్ విద్యాసంస్థలకు స్థానిక సెలవు ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. రహదారులపై రద్దీ, ట్రాఫిక్ సమస్యలు మరియు భారీగా విగ్రహాల నిమజ్జనం జరగనున్న దృష్ట్యా విద్యార్థుల సౌకర్యార్థం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ స్థానిక సెలవుకు బదులుగా రాబోయే సాధారణ సెలవు దినమైన రెండవ శనివారం నాడు జిల్లాలోని అన్ని విద్యాసంస్థలు సాధారణ పనిదినంగా పనిచేస్తాయని తెలిపారు. ఈ ఉత్తర్వులను జిల్లాలోని విద్యాశాఖ అధికారులు, విద్యాసంస్థల యాజమాన్యాలు విధి గా అమలు చేయాలని సూచించారు.

# రైతులకు వ్యవసాయ కరెంట్ ఇబ్బందులు

## డిఈ కార్యాలయం ఎదుట కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ధర్నా



అక్షర కలం,చౌటుప్పల్

వ్యవసాయానికి అవసరమైన విద్యుత్‌ను సక్రమంగా సరఫరా చేయకుండా రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ మునుగోడు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో చౌటుప్పల్ విద్యుత్ శాఖ డిఈ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. వ్యవసాయానికి ప్రభుత్వం ప్రకటించిన మేరకు విద్యుత్ సరఫరా జరగడం లేదని,విద్యుత్ కోతల కారణంగా రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు.బోర్లు,మోటార్లపై ఆధారపడే రైతులకు కరెంట్ ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొందని అన్నారు.వ్యవసాయానికి వాస్తవంగా ఎన్ని గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నారో లాగ్‌బుక్‌లో ఉన్న వివరాలను చూపించాలని విద్యుత్ శాఖ అధికారులను కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి కోరారు. అయితే అధికారులు వెంటనే స్పష్టమైన వివరాలు వెల్లడించకుండా,సరఫరా వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేస్తామని చెప్పినట్లు ఆయన తెలిపారు.రైతులకు న్యాయమైన విద్యుత్ అందడం లేదని,ఇవ్వాల్సిన సమయానికి కూడా సరఫరా జరగడం లేదని అధికారుల దృష్టికి తీసుకెళ్లిన అనంతరం,ఇకపై అదనంగా రెండు గంటల విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ అధికారులు హామీ ఇచ్చినట్లు కూసుకుంట్ల తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు,తదితరులు, పాల్గొన్నారు.

# సహజ వ్యవసాయంతో రైతులకు మేలు ---జ్యోతి రెడ్డి

## జ్యోతి రెడ్డిఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమము



నార్కట్పల్లి, సెప్టెంబర్ 22 ; రైతులు రసాయన ఎరువులు, పురుగు మందులపై అధికంగా ఆధారపడకుండా సహజ వ్యవసాయ పద్ధతులను అవలంబించి, తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులు సాధించేలా ప్రోత్స హించేందుకు జ్యోతి రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నార్కట్పల్లిలో సహజ వ్యవసాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డా. జ్యోతి రెడ్డి దుడ్డిపాల, కర్నాటి వెంకన్న, ఏవో. గౌతమ్, ఏ ఈ ఓ శిరీష, తదితరులు పాల్గొని రైతులకు సహజ వ్యవసాయం ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భం గా రైతులకు సహజ వ్యవసాయం, నేల ఆరోగ్యం, సేంద్రియ ఎరువుల వినియోగం, దేశీ ఆవు ఆధారిత వ్యవసాయ పద్ధతులు, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు రసాయన ఆధారిత వ్యవసాయంతో పెరుగుతున్న సాగు ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు, నేల సహజ సారాన్ని కాపాడుకోవడానికి సహజ వ్యవసాయ పద్ధతులు ఉపయోగపడతాయని నిర్వాహకులు వివరించారు. జ్యోతి రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు సేంద్రియ ఎరువును పంపిణీ చేశారు. రైతులు తమ పొలాల్లో సహజ వ్యవసాయ పద్ధతులను దశలవారీగా ఆచరణలోకి తీసుకు రావాలని నిర్వాహకులు సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా రైతుల్లో సహజ వ్యవసాయంపై అవగాహన పెంచడంతో పాటు, ఆరోగ్యకరమైన నేల ఆరోగ్యకరమైన పంట ఆరోగ్యకరమైన సమాజంఅనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు. నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో , రైతులు స్థానిక ప్రజలు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# నాడు బడి బాట..నేడు ఉపాధ్యాయులుగా మారిన గ్రామ సర్పంచ్ రోజా లక్ష్మణ్ నాయక్: మర్రికుంట తండా పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు

తిరుమలగిరి సెప్టెంబర్ 22 ( అక్షర కలం)

సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరి మండల కేంద్రంలోని మర్రికుంట తండా గ్రామపంచాయతీలో ఒక అరుదైన, స్ఫూర్తిదాయకమైన సంఘటన చోటుచేసుకుంది. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత కారణంగా విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడకూడదనే ఉద్దేశంతో గ్రామ సర్పంచ్ బానోతు రోజా లక్ష్మణ్ నాయక్ తానే స్వయంగా ఉపాధ్యాయురాలిగా మారి పిల్లలకు పాఠాలు బోధించారు.వివరాల్లోకి వెళ్తే.. గతంలో ఈ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో కేవలం ఒకటి లేదా ఇద్దరు పిల్లలు మాత్రమే ఉండటంతో, విద్యార్థుల సంఖ్య లేదనే కారణంతో పాఠశాలను రద్దు (క్లోజ్) చేస్తామని మండల విద్యాశాఖ అధికారి సర్పంచ్‌కు సమాచారం ఇచ్చారు. అయితే విద్యా వ్యవస్థను కాపాడుకోవాలని, తండాలోని పాఠశాలను ఎట్టి పరిస్థితుల్లోనూ మూసివేయనివ్వనని సర్పంచ్ బానోతు రోజా లక్ష్మణ్ నాయక్ ఎంఈఓకు విజ్ఞప్తి చేశారు. బడిబాట కార్యక్రమంలో ఇచ్చిన హామీ మేరకు ఆమె గ్రామస్తులతో ప్రత్యేకంగా మాట్లాడి, గ్రామసభను నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల ప్రాధాన్యతను వివరిస్తూ స్వయంగా తన కుమారుడితో పాటు గ్రామానికి చెందిన 20 మంది పిల్లలను పాఠశాలలో చేర్పించి బడిని పునరుద్ధరించారు. కానీ, ప్రస్తుతం ఈ పాఠశాలలో కేవలం ఒక్కరే ఉపాధ్యాయుడు విధులు నిర్వహిస్తున్నారు. సదరు ఉపాధ్యాయుడు కూడా తరచూ సెలవులు పెట్టడం, మీటింగ్‌ల పేరుతో పాఠశాలకు సరిగ్గా హాజరు కాకపోవడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఉపాధ్యాయుడు లేక పిల్లలు ఖాళీగా కూర్చోవడం గమనించిన సర్పంచ్ రోజా లక్ష్మణ్ నాయక్ తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఉపాధ్యాయుడి నిర్లక్ష్యం వల్ల పిల్లల చదువు పాడవకూడదని భావించిన ఆమె, ఈరోజు తానే స్వయంగా క్లాస్ రూమ్‌లోకి వెళ్లి పిల్లలకు పాఠాలు నేర్పించారు. పిల్లలతో కలిసిపోయి వారికి నచ్చిన రీతిలో విద్యాబోధన చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఎంతో కష్టపడి పిల్లలను బడిలో చేర్పిస్తే, ఉపాధ్యాయుల కొరత మరియు ఉన్న ఉపాధ్యాయుల నిర్లక్ష్యం వల్ల విద్యావ్యవస్థ దెబ్బతింటోందని మండిపడ్డారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి మర్రికుంట తండా పాఠశాలకు రెగ్యులర్ ఉపాధ్యాయులను నియమించాలని, పిల్లలకు న్యాయం చేయాలని ఆమె డిమాండ్ చేశారు. సర్పంచ్ తీసుకున్న ఈ చొరవను, పిల్లల పట్ల ఆమె చూపిన బాధ్యతను తండా ప్రజలతో పాటు మండల వాసులు కూడా అభినందిస్తు.. జిల్లా కలెక్టర్, స్థానిక శాసనసభ్యులు మందుల సామేలు, జిల్లా విద్య శాఖ అధికారులకు మా గ్రామపంచాయతీలో పాఠశాలలో ఉన్న పిల్లలకు, మాకు న్యాయం చేయాలని కోరారు.



# సేవా స్ఫూర్తిని చాటిన జర్నలిస్టుల రక్తదాన శిబిరం

-ఘనంగా టీయూడబ్ల్యూజే అధ్యక్షుని జన్మదినం

-భారీగా తరలివచ్చిన జర్నలిస్టులు

అక్షర కలం, అందోలు ప్రతినిధి:

తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐజేయూ) సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బండారు యాదగిరి జన్మదినాన్ని పురస్కరించుకొని మంగళవారం సంగారెడ్డి ఐబీలో నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతమైంది. సంగారెడ్డి జిల్లా నలుమూలల నుంచి జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేసి సామాజిక బాధ్యతను చాటారు. సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు కలెక్టర్ పాండు, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, జెడ్పీ సీఈవో జానకి రెడ్డి, జిల్లా యువజన సంక్షేమ అధికారి అఖిలేష్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంతకిషన్ తదితరులు జర్నలిస్టుల రక్తదాన శిబిరం నిర్వహణను అభినందించారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు బండారు యాదగిరి మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ ఆధ్వర్యంలో జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం సంఘం నిరంతరం పనిచేస్తోందన్నారు. గ్రామీణ జర్నలిస్టుల బస్‌పాస్‌లు, ఇళ్ల



స్థలాలు తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ఏ.కే. ఫైసల్ మార్గనిర్దేశంలో శిబిరాన్ని నిర్వహించామని తెలిపారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు ఫైసల్ మాట్లాడుతూ సంగారెడ్డితో పాటు పటాన్‌చెరు, జహీరాబాద్, సదాశివపేట, ఆందోల్, హత్నూర, నారాయణఖేడ్ ప్రాంతాల నుంచి జర్నలిస్టులు తరలివచ్చారని పేర్కొన్నారు. వార్తా సేకరణతో పాటు సామాజిక సేవలోనూ జర్నలిస్టులు ముందుండాలన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంతకిషన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు డాక్టర్ శ్రీహరి, బీజేపీ సీనియర్ నేత జగన్ యాదగిరిని శాలువాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.అనిల్‌కుమార్, ఉపాధ్యక్షులు శ్రీనాథ్, మల్లేష్, కిషోర్, జాయింట్ సెక్రటరీ శ్రీనివాసరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉలువల రాజు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ప్రధాన కార్యదర్శి బసవేశ్వర్, చిన్న మధ్యతరహా పత్రికల సంఘం అధ్యక్షుడు సిద్ధిక్, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ చవాన్, కోశాధికారి లక్ష్మణ్, సిరి దినపత్రిక సీఈవో శివశంకరరావు, రథసారథి దినపత్రిక సీఈవో సంతోష్ గౌడ్, సదాశివపేట ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు హాజీ, పటాన్‌చెరు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నరసింహ, ప్రధాన కార్యదర్శి యాదగిరి, పుల్కల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మల్లేశం, జిల్లా కార్యవర్గ సభ్యుడు శివన్న జైన్, ఇర్షన్, ఝరా సంఘం మహేష్‌తో పాటు కొంపల్లి విద్యాసాగర్, మ్యాడమ్ రాధాకిషన్, పుల్లూరి ప్రకాష్, కుందారం రాజయ్య, మనోహర్, ఆమెటి మహేందర్, దాచేపల్లి రవీందర్, పుర్ర రాములు, జోగన్నగారి యాదగిరి, సాహితీ స్కూల్ రవికుమార్ బుస్సా శ్రీనివాస్, రాచర్ల ప్రసాద్, కె.చంద్రశేఖర్, మాణిక్ ప్రభు ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆమెటి కృష్ణ, సదాశివపేట జయరాములు గుప్తా తోపాటు రాష్ట్ర యువజన సంఘాల సమాఖ్య అధ్యక్షుడు కూన వేణు పాల్గొని యాదగిరికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# ఆరోగ్యమైన పాదాలే జీవితానికి బలమైన పునాది

## హైదరాబాద్ హైటెక్ సిటీ యశోద ఆసుపత్రి వైద్యుడు ఆదిత్య సోమయాజి

జగిత్యాల సెప్టెంబర్ 22 : (అక్షర కలం




ఆరోగ్యమైన పాదాలే మనిషి చురకైన జీవితానికి బలమైన పునాది అని హైదరాబాద్ హైటెక్ సిటీలోని యశోద ఆసుపత్రి వైద్యుడు ఆదిత్య సోమయాజి పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో మంగళవారం హైదరాబాద్ హైటెక్ సిటీ యశోద ఆసుపత్రి ఆధ్వర్యంలో రోగులకు పాదం, మడమ సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ పాదం, మడమ శస్త్ర చికిత్స నిర్వహించే వైద్యుడు ఆదిత్య సోమయాజి హాజరై పాదం, మడమ సమస్యలు, చికిత్సలో ఆధునిక పురోగతులు తదితర అంశాలపై సమగ్రంగా వివరించారు. అనంతరం జగిత్యాల ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. పాదం, మడమ సమస్యలు చాలా సాధారణమైనవే అయినప్పటికీ నిర్లక్ష్యం చేయడంతో నొప్పి ఎక్కువగా అయ్యే అవకాశాలు ఉంటాయన్నారు. ఇలాంటి సమస్యలు తరుచుగా కాలు బెనకడం, క్రీడల వచ్చే గాయాలు, మధుమేహంతో సమస్యలు ఎక్కువగా వస్తాయన్నారు. వీటిని ఆరంభ దశలోనే గుర్తించి వైద్యులను సంప్రదించాలన్నారు. సమస్య తీవ్రతరం అయితే శాశ్వత వైకల్యం పొందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు.ఇలాంటి సమస్యలకు ఆధునిక స్కానింగ్ పద్ధతులతో ఖచ్చితంగా సమస్యను గుర్తించి యశోద ఆసుపత్రి ఆధ్వర్యంలో చికిత్సలు అందిస్తున్నామన్నారు. అత్యాధునిక ఇంప్లాంట్లు, త్రీడి ప్రింటింగ్ సాంకేతికతతో క్లిష్టమైన ఎముక విరుగుళ్లు, పాద వికృతుల లోపాలను కూడా సమర్థవంతంగా చికిత్స చేయవచ్చునన్నారు. అవసరమైతే యాంకిల్ జాయింట్ మార్పిడి ద్వారా నడకను మెరుగుపరచవచ్చునన్నారు. ఇలాంటి చికిత్సలు హైటెక్ సిటీ యశోద ఆసుపత్రి ఆధ్వర్యంలో విజయవంతం గా పూర్తి చేయడంతో ఎంతో మంది ఆధునిక ఫిజియోథెరపి, పునరావాస చికిత్సల తో రోగులు త్వరగా తమ రోజువారీ పనులు, ఉద్యోగం, క్రీడలకు తిరిగి వెల్లుతున్నారన్నారు. ఆరోగ్య వంతమైన జీవితం కోసం ప్రతి ఒక్కరూ పాదం, మడమ నొప్పిని నిర్లక్ష్యం చేయవద్దని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మార్కెటింగ్ మేనేజర్లు ధనుంజయ, పాలకుర్తి నవీన్ కుమార్ తదితరులు ఉన్నారు.

# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి జీవన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్.

అక్షరకలం/మల్యాల : మల్యాల మండల కేంద్రానికి చెందిన దొంతరవేణి లక్ష్మయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రివర్యులు జీవన్ రెడ్డి,మాజీ శాసనసభ్యులు సుంకే రవిశంకర్ మంగళవారం వారి నివాసానికి చేరుకుని, లక్ష్మయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా లక్ష్మయ్య కుమారుడు దొంతరవేణి శేఖర్ సహా ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి, సానుభూతిని తెలియజేసి, ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి మండల అధ్యక్షుడు శ్రీనివాస్,మాజీ సర్పంచ్ బద్ధం తిరుపతి రెడ్డి, మాజీ ప్యాక్స్ చైర్మన్ సాగర్ రావు, నాయకులు గడ్డం రాజేశ్వర్, పోతరాజు శ్రీనివాస్,సంత గౌతంరెడ్డి,కట్కూరి అరుణ్, బట్టు నవీన్, జవాజి శ్రీనివాస్, సంఘ సత్తన్న, పూదూరి చందు, రవి, సలీం, వంగలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# కమలాపురం చెరువును సందర్శించి నిమజ్జన భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ

అక్షర కలం, అందోలు:

సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్, మానూర్, నాగల్గిద్ద మండలాలకు సంబంధించిన వినాయక నిమజ్జనాలు జరగనున్న కమలాపురం చెరువును జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సందర్శించి అక్కడ చేపట్టిన భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా వినాయక నిమజ్జనాలు ప్రశాంతంగా జరిగేలా పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 9, 11 రోజులలో అధిక సంఖ్యలో వినాయక విగ్రహాలు నిమజ్జనం కానున్న నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన లైటింగ్, క్రేన్లు, గజ ఈతగాళ్లను ముందుగానే అందుబాటులో ఉంచాలని సూచించారు. గణేష్ శోభాయాత్రలు జరిగే మార్గాల్లో రోడ్ల పరిస్థితి, అవసరమైన మరమ్మతులు, చెరువు వద్ద బారికేడింగ్, భద్రతా లైటింగ్, పారిశుద్ధ్య ఏర్పాట్లు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో చర్చించారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని జిల్లా ఎస్పీ సూచించారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా జరిగేలా పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, ఫైర్ తదితర శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. ఎస్పీ వెంట నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్ రెడ్డి, అధికారులు, ఇతర సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

# ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య. సి ఎం కు శ్రీవారి ప్రసాదం అందజేసిన కోరం



**అక్షర కలం ఇల్లందు ప్రతినిధి :-**

ఇటీవల తిరుమల శ్రీవారి దైవ దర్శనార్థం వెల్లి వచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రి ని శ్రీవారి శాలవతో సత్కరించి శ్రీవారి మహా ప్రసాదమును మంగళవారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అందజేశారు. ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అర్హులైన పేదలకు అందజేస్తున్న ఇందిరమ్మ ఇల్లు పథకంలో భాగంగా గిరిజన శాసనసభ నియోజకవర్గాలకు అధికంగా ఇందిరమ్మ ఇల్లు కేటాయించవలసిందిగా సహచర గిరిజన ఎమ్మెల్యేలతో పాటు ఇల్లందు శాసనసభసభ్యులు కోరం కనకయ్య కోరారు. తెలంగాణ రాష్ట్రం గౌరవ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ని కలసిన అనంతరం హైదరాబాద్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయం లో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ను, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ గార్ల సమక్షంలోవారిని కలిసి తిరుపతి ప్రసాదం అందించారు.

# అంబేద్కర్ నగర్ కాలనీలో డ్రైనేజ్ సమస్యను పరిష్కరించాలి

**అక్షర కలం/ సింగరేణి:**



సింగరేణి గ్రామపంచాయతీ లోని అంబేద్కర్ నగర్ కాలనీలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ సింగరేణి మండల కమిటీ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి కి మంగళవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ మండల కార్యదర్శి ఆదేర్ల వినయ్ కుమార్ మాట్లాడుతూ అంబేద్కర్ నగర్ కాలనీలో తేలికపాటి వర్షం పడినా రహదారులు బురదమయం అవుతున్నాయని దీనికి కారణం డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడమేనని ఇండ్లలో వాడుకుంటున్న మురుగునీరు వెళ్లే దారి లేక చిన్నపాటి వర్షానికి వర్షపు నీరు మురుగునీరు కలిసి ఇండ్ల బయటికి వచ్చి బురద మయంగా మారుతున్నాయని ఈ సమస్యను పరిష్కరించాలని కారేపల్లి గ్రామపంచాయతీ అధికారులు ప్రజాప్రతినిధులను డిమాండ్ చేశారు. నీరు ఎక్కడికక్కడ ఆగిపోవడం వలన దోమలకు నెలవుగా మారి పర్యావరణం దెబ్బతిని ప్రజలు అనారోగ్యం పాలవుతున్నా రని మరియు రహదారిపై నడవడానికి ఇబ్బందులు కలుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చూసి వదిలేయడం తప్ప శాశ్వత పరిస్కారం చూపాలని లేనియెడల ప్రజలను కూడగట్టి సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆధర్ల నాగరాజు, సాయి, పిట్టల నాగరాజు పాల్గొన్నారు.

# ఎంపీ వద్దిరాజు ఖమ్మంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు



**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి :**

బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర తన సిఫార్సుతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు.అనారోగ్యానికి గురైన 34 మందికి సీఎంఆర్ఎఫ్ ద్వారా తాను మంజూరు చేయించిన 7 లక్షల రూపాయల చెక్కులను ఎంపీ రవిచంద్ర మంగళవారం ఉదయం అందజేశారు.ఖమ్మం బురహాన్ పురంలోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీ వద్దిరాజు వెంట బీఆర్ఎస్ నాయకులు శీలంశెట్టి వీరభద్రం, తోట రామారావు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జనం కుల, మతాలకు అతీతంగా సామరస్యంతో జరుపుకోవాలి.. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 22:**



వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని కుల, మతాలకు అతీతంగా సామరస్యంతో సంతోషంగా జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రమైన మంచిర్యాల పట్టణంలో అంజనీపుత్ర ఎస్టేట్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరసిద్ధి వినాయక మండలిని సందర్శించి వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, వినాయక నిమజ్జనం కుల, మతాలకు అతీతంగా సామరస్యంతో సంతోషంగా జరుపుకోవాలని తెలిపారు. శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలుగకుండా అందరూ కలిసి జరుపుకోవాలని, నిమజ్జన ప్రాంతాలలో నిబంధనల ప్రకారం జాగ్రత్తలు వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంజనీపుత్ర ఎస్టేట్స్ గుర్రాల శ్రీధర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అక్టోబర్ 10న హైదరాబాద్‌లో తానూ నాయక్ సంగారా ఉత్సవాలు

## -రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరాం నాయక్ పిలుపు

**అక్షర కలం/ మహబూబాబాద్:**

తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర 4 వ మహాసభలు అక్టోబర్ 10,11 తేదీల్లో హైదరాబాదులో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ మహాసభల సందర్భంగా తెలంగాణ సాయుధ పోరాట యోధుడు తానూ నాయక్ పేరుపై సంగారా ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. అంతరించిపోతున్న గిరిజనుల సంస్కృతిని పరిరక్షించుకోవడంలో భాగంగా జరుగుతున్న ఈ ఉత్సవాలలో రాష్ట్ర నలుమూలల నుండి వేలాదిమంది గిరిజన కళాకారులు, ఉద్యమ నాయకులు, మేధావులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటున్నారన్నారు. ఈ ఉత్సవాలలో ముఖ్య అతిథులుగా ఆదివాసి అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ కన్వీనర్ పులిపై బస్కీ, ఉత్సవాల ఆహ్వాన సంఘం గౌరవ చైర్మన్ డోర్నకల్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ డా.



రామచంద్రనాయక్, ఆహ్వాన సంఘం అధ్యక్షులు,మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, గిరిజన ఎంపీలు,ఎమ్మెల్యేలతో పాటు గిరిజన సంఘాల నాయకులు పాల్గొంటారని తెలిపారు. రెండు రోజులపాటు హైదరాబాదులో జరుగుతున్న రాష్ట్ర మహాసభల్లో రాష్ట్రంలో గిరిజనులు ఎదుర్కొంటు న్న సమస్యలపై చర్చించి భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ తీసుకుంటామన్నారు. కేంద్రంలో బిజెపి గిరిజనులకు రాజ్యాంగంలో కల్పించిన హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు. గిరిజన సంస్కృతి ఆచారాలపై ఆధిపత్య మనువాద భావజాలంతో దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురి చేసే విధంగా బిజెపి ఆర్ఎస్ఎస్ శ్రేణులు ప్రయత్నిస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల డిక్లరేషన్ లో ప్రతి గిరిజన కుటుంబానికి 12 లక్షలు ఇస్తామని, మైదాన ప్రాంతంలో 5 ఐటిడిఏలను ఏర్పాటు, ప్రతి గిరిజన తండా,గూడెం గ్రామపంచాయతీలకు ప్రతి ఏటా 25 లక్షలు, పోడు భూములకు హక్కు పత్రాలు, మూడు గిరిజన కార్పొరేషన్ ఏర్పాటు చేసి వాటికి ప్రతి ఏటా 1500 కోట్లు ఇస్తామంటూ అనేక హామీలను ఇచ్చిందన్నారు. వాటిని ఇంతవరకు అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. హామీల అమలు కోసం భవిష్యత్తులో కలిసి వచ్చే గిరిజన సంఘాలతో పెద్ద ఎత్తున ఉద్యమం ఇస్తామన్నారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా నాయకులు మాలోత్ కిషన్,వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు సాధుల శ్రీనివాస్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గునిగంటి రాజన్న తదితరులు హాజరయ్యారు.

# ఏఐకేఎంఎస్ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఇల్లందులో భారీ ట్రాక్టర్ ర్యాలీ.

**అక్షర కలం ఇల్లందు ప్రతినిధి:-**

సెప్టెంబర్ 28,29,30 తేదీలలో ఖమ్మం పట్టణంలో జరిగే ఏఐకేఎంఎస్ జాతీయ 4వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం ఇల్లందు పట్టణంలో భారీ ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. కొమరారం నుండి ప్రారంభమైన ర్యాలీ మామిడిగూడెం, సీతనగరం, రొంపేడు, 21 ఫీట్,కోర్టు ఏరియా నుండి గోవింద్ సెంటర్ కొత్తబస్టాండ్, మెయిన్ రోడ్, ప్రభుత్వ హాస్పిటల్ సెంటర్ జై కే కాలనీ నుండి ఆమ్ బజార్ మీదుగా ర్యాలీని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కొత్త బస్టాండ్ సెంటర్లో నిర్వహించిన సభలో ఏఐకేఎంఎస్ జాతీయ ఉపాధ్యక్షులు జేవి చలపతిరావు, రాష్ట్ర




కార్యదర్శి గౌని ఐలయ్య మట్లాడుతూ దేశంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలపై రైతులు కూలీలు ఏకమై పోరాడాలని వారు పిలుపునిచ్చారు. ఎన్నికలకు ముందు రైతులకు 12000 ఇస్తామని,వ్యవసాయ రంగాన్ని రక్షిస్తామని ప్రగల్బాలు పలికిన ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు వ్యవసాయాన్ని దారాదత్తం చేస్తూ నూతన వ్యవసాయ రంగ చట్టాలతో పల్లెలో నివసించే రైతులను దివాలా తీపిస్తున్నారని అన్నారు. నూతన యాప్ లను తీసుకొచ్చి ఏజెన్సీ ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం వల్ల సరైన సమయానికి ఎరువులు అందకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన చెందారు. స్వామినాథన్ కమిషన్ సూచనల ప్రకారం పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేశారు. స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలని, ఉపాధి హామీ పథకాన్ని పాత పద్ధతిలోనే కొనసాగించాలని, విద్యుత్తు సవరణ బిల్లు, విత్తన చట్ట బిల్లు, నూతన అటవీ హక్కుల నియమాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై చర్చించి భవిష్యత్తు కర్తవ్యాలు రూపొందించుటకు జరుగుతున్న ఈ మహాసభలను రైతులు కూలీలు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఆవునూరి మధు, తుపాకుల నాగేశ్వరరావు, కల్తి వెంకటేశ్వర్లు, రాసుద్దీన్, కొప్పుల శ్రీను,రామచందర్, పూనెం రంగన్న, కొమరం సత్యనారాయణ, పూనెం కోటయ్య, మూడు మాలు, సువర్ణపాక నాగేశ్వరరావు,పొడుగు నర్సింహా రావు, బట్టు ప్రసాద్, మోకాళ్ల రమేష్, కొక్కు సారంగపాణి, తోడేటి నాగేశ్వరరావు, మోకాళ్ల కృష్ణ, జరుపుల కిషన్,ముక్తి రమేష్, చిన్న స్వామి,మోతిలాల్,వాంకుడోత్ సరోజినీ, శ్రీను, సంతు,వజ్జ మధు,జోగకృష్ణ,చిరంజీవి,బొర్రా వెంకన్న,రావూరి ఉపేందర్, అటికం శేఖర్, మండల వెంకన్న, వెంకటనర్సయ్య, బొగ్గారపు రాజు,లాజర్,రాందాస్, శివ, ఉదయ్,రమేష్,భరత్, వీరన్న,వేంపెల్లి వెంకటేశ్వర్లు, దనుంజయ,సీతారామ రాజు, బాసాని వెంకటేశ్వర్లు, బస్సీ, మంగీలాల్, కోడి పాపారావు, తుడుం శ్రీను, హర్ష, తదితరులు పాల్గొన్నారు.

# పర్ణశాలలో భక్తులకు తప్పని డ్రెస్సింగ్ రూమ్ కష్టాలు.

**అక్షర కలం / భద్రాచలం**

శ్రీరామచంద్రుడు నడయాడిన పావన ప్రదేశంగా పేరుగాంచిన పర్ణశాలకు నిత్యం వందలాది మంది భక్తులు తరలివస్తుంటారు. భద్రాచలంశ్రీసీతారామచంద్రస్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు పర్ణశాలను సందర్శించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ముఖ్యంగా పర్ణశాల రామయ్యను దర్శించుకునే ముందు గోదావరి నదిలో పుణ్యస్నానం ఆచరించి స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు ఆసక్తి చూపుతుంటారు. అయితే గోదావరి నది వద్ద స్నానమాచరించే మహిళా భక్తులు బట్టలు మార్చుకునేందుకు సరైన





సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఏర్పాటు చేసిన డ్రెస్సింగ్ రూమ్‌లు ప్రస్తుతం నిర్వహణ లేక దీనస్థితికి చేరుకోవడంతో వాటిని వినియోగించుకోలేని పరిస్థితి నెలకొంది.నిత్యం భక్తులతో కళకళలాడే పర్ణశాల వంటి ప్రముఖ పుణ్యక్షేత్రంలో గోదావరి తీరంలో మహిళా భక్తుల కోసం కనీస సౌకర్యాలు అందుబాటులో లేకపోవడం పట్ల భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి కుటుంబ సమేతంగా వచ్చే మహిళలు స్నానానంతరం దుస్తులు మార్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తుల సౌకర్యాలను దృష్టిలో పెట్టుకుని గోదావరి నది ఒడ్డున ఉన్న డ్రెస్సింగ్ రూమ్‌లను వెంటనే మరమ్మతులు చేసి, పరిశుభ్రంగా, సురక్షితంగా వినియోగించుకునేలా ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు. అవసరమైతే అదనంగా మరిన్ని డ్రెస్సింగ్ రూమ్‌లను నిర్మించి, మహిళా భక్తులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పర్ణశాలకు వచ్చే భక్తుల సమస్యను పరిష్కరించి, గోదావరి తీరంలో అవసరమైన సౌకర్యాలను కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి.. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 22:**

ప్రభుత్వ పాఠశాలలలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. మంగళవారం జిల్లాలోని తాండూర్ మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి అదనపు గదులు, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, సకల సదుపాయాలతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండలంలోని ద్వారకాపూర్ గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను మండల తహశీల్దార్ జ్యోత్స్న తో కలిసి పరిశీలించారు. భూ సమస్యల పరిష్కారం కొరకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ సర్వే ప్రక్రియను పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని తెలిపారు. గ్రామ నక్షాలు, రైతుల సంబంధిత భూముల నిర్ధారణ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా రికార్డులతో సరి చూసి క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. భవిష్యత్తులో భూ వివాదాలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పురోగతి, ఆసరా పింఛన్ల దరఖాస్తుల పరిశీలన వివరాలను పంచాయతీ కార్యదర్శిని అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వార్డులు, మందుల నిల్వలు, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించి ఆరోగ్య కేంద్రం పరిధిలో గల గర్భిణుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవ అందించాలని, గర్భిణులు సమయానుసారంగా అవసరమైన పరీక్షలు చేసుకొని, పౌష్టిక ఆహారం తీసుకోవాలని, తప్పనిసరిగా ఆసుపత్రిలోనే ప్రసవం చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని తెలిపారు. మండల తహశీల్దార్ కార్యాలయాన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ తో కలిసి సందర్శించి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో మ్యాపింగ్ కాని, అనమలిస్ జాబితాలో ఓటర్లకు జారీ చేసిన నోటీసులకు సంబంధించి ఓటర్లు అందిస్తున్న ధ్రువపత్రాల పరిశీలన వేగవంతం చేయాలని, అర్హత గల ప్రతి ఓటరు వివరాలు జాబితాలో తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వివిధ దృవపత్రాల కొరకు వచ్చిన దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి నిర్ణీత గడువులోగా జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం బెల్లంపల్లి మండల కేంద్రంలో భారత జాతీయ రహదారుల శాఖ ఆధ్వర్యంలో తలపెట్టిన గోశాల కొరకు డిసిపి ఎ భాస్కర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, జాతీయ రహదారుల సంస్థ పిడి అజయ్ మణికుమార్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, తహశీల్దార్ కృష్ణ లతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గోశాల కొరకు జాతీయ రహదారుల శాఖ ఆధ్వర్యంలో 1 ఎకరం 15 గుంటల విస్తీర్ణంలో గోశాల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955